నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
## ఆదివారం
7.4.2024



## సైన్స్ ఆధారంగా
# తొలి ప్రపంచ పటం

గడప దాటకుండానే చిత్రించిన సన్యాసి...

ఈ అద్భుతాన్ని ఎలా సాధించారు...?

# చైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**తిరుమల లడ్డూకు ఎంతో గొప్ప విశిష్టత ఉంది. తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకోలేనివారు ఆ స్వామివారి ప్రసాదం స్వీకరించి తరిస్తూ ఉంటారు. స్వామివారిని దర్శించుకున్నంత పుణ్యం వచ్చిందని భావిస్తుంటారు. అందుకే దర్శనం తర్వాత లడ్డూకౌంటర్ల వద్ద నిరీక్షించి మరీ లడ్డూలను కొనుగోలు చేస్తుంటారు. కానీ భక్తులు తగిన లడ్లు దొరక్క ఇబ్బంది పడుతున్నారు కదా? టిటిడి బోర్డు చర్యల తీసుకోవాలని కోరుకుంటున్నాను. మీరే మంటారు సర్.**

**ఆకుల విజయలక్ష్మి , విజయవాడ**

మీరన్నది నిజమే దేవదేవుని  దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షించిన భక్తులు.. ఆ తర్వాత కూడా లడ్డూల కోసం ఎంతో ఓపికగా ఎదురుచూసి మరీ లడ్డూలు కొంటుంటారు. ఇక్కడ చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవం. ఈ క్రమంలోనే లడ్డూల విషయంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. వేసవి రద్దీ దృష్ట్యా తిరుమలలో భక్తుల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఇటీవల డయల్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలోనే లడ్డూల విషయాన్ని ఓ భక్తుడు ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. లడ్డూ ప్రసాదం కాంప్లెక్స్‌లో ఎదురౌతున్న సమస్యను ఫోన్ కాల్ ద్వారా టీటీడీ ఈవో దృష్టికి తెచ్చారు. శ్రీవారి దర్శనం త్వరగానే పూర్తవుతున్నప్పటికీ.. లడ్డూప్రసాదం జారీలో ఆలస్యం అవుతోందని ఈవో దృష్టికి తెచ్చారు. లడ్డూ ప్రసాదం కాంప్లెక్స్‌లోని ఉద్యోగులకు షిఫ్టులవారీగా విధులు కేటాయిస్తూ ఉంటారు. ఈ క్రమంలో షిఫ్టుల మార్పుల కారణంగా లడ్డూల జారీలో ఆలస్యం అవుతోందని.. త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో భక్తుడి ఫిర్యాదు మీద ఈవో ధర్మారెడ్డి స్పందించారు. 60 లడ్డూ కౌంటర్ల ద్వారా లడ్డూలు పంపిణీ చేస్తున్నట్లు భక్తుడికి వివరించారు. అయితే వేసవిలో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని.. అందుకు అనుగుణంగా మరో 15 కౌంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు. మొత్తం 75 కౌంటర్ల ద్వారా లడ్డూలను త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అదనపు కౌంటర్ల ఏర్పాటు ద్వారా లడ్డూ ప్రసాదం కాంప్లెక్స్‌లో క్యూలైన్లలో భక్తులు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా చూస్తామని ఈవో ధర్మారెడ్డి అన్నారు. ఎండాకాలంలో శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తామని తెలపడం హర్షణీయం.

**ప్రస్తుతం దేశం మొత్తం సార్వత్రిక ఎన్నికల సమరానికి తెరలేచింది. మరోసారి గెలిచి కేంద్రంలో హ్యాట్రిక్ కొట్టాలని ఎన్డీఏ కూటమి ఆరాటపడుతుండగా.. నరేంద్ర మోదీ సర్కార్‌ను గద్దె దించాలని ప్రతిపక్ష ఇండియా కూటమి వ్యూహాలు రచిస్తోంది. ఈ క్రమంలోనే ఈసారి ఎన్నికలు రసవత్తరంగా సాగుతాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్‌లో జరగనున్న ఎన్నికల్లో డ్రాగన్ తలదూర్చే యత్నాలు చేస్తోందని ఆందోళనలు ఉన్నాయి. మీరేమంటారు సర:.**

**కందుల కిషోర్ కుమార్, హైదరాబాద్**

అవును మీరు చెపుతున్న విషయం వాస్తవమే. కిషోర్ గారూ... భారత్‌లో జరగనున్న ఎన్నికల్లో డ్రాగన్ తలదూర్చే యత్నాలు చేస్తోందని మైక్రోసాఫ్ట్.. ఆందోళన వ్యక్తం చేసింది.  ఈ క్రమంలోనే దిగ్గజ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ కీలక విషయాలు వెల్లడించింది. భారత్‌లో మరికొన్ని రోజుల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకునే అవకాశాలు ఉన్నాయని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐని ఉపయోగించుకుని.. లోక్‌సభ ఎన్నికలపై చైనా ప్రభావం చూపించే అవకాశం ఉందని తెలిపింది. ఏఐ ఆధారిత సమాచారంతో భారత్‌తో పాటు అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో ఉన్న ఎన్నికలపైన కూడా ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికల వేళ ఏఐ ఆధారిత సమాచారాన్ని సోషల్ మీడియా వేదికగా ద్వారా ప్రచారం చేయనున్నారని మైక్రోసాఫ్ట్ తెలిపింది. భారత్‌లో కీలకంగా ఉండే ఎన్నికలు తమకు అనుకూలంగా ఉండే రీతిలో చైనా ఆ ప్రచారం చేసే అవకాశం ఉందని పేర్కొంది. సోషల్ మీడియాలో మీమ్స్, డీప్ ఫేక్ ఫొటోలు, వీడియోలు, ఆడియోల రూపంలో ఆ కామెంట్ ఉండే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే చైనాకు మద్దతుగా ఉండే రీతిలో ఆ సోషల్ మీడియా కంటెంట్‌ను రూపొందించనున్నారని వెల్లడించింది. ఇలాంటి ఎత్తుగడలతో లోక్‌సభ ఎన్నికల్లో ప్రభావం చూపడం తక్కువే అన్న అభిప్రాయాన్ని కూడా మైక్రోసాఫ్ట్ వ్యక్తం చేసింది. ఈ ఏడాది ప్రపంచంలోని దాదాపు 64 దేశాల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ప్రపంచ జనాభాలో ఈ దేశాల వాటా 49 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ జనాభాలో దాదాపు సగం మంది అభిప్రాయాలను ప్రభావితం చేసేందుకు చైనా ప్రణాళికలు రచిస్తోందని తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ ఇంటిలిజెన్స్ టీమ్ హెచ్చరికల ప్రకారం.. చైనా కేంద్రంగా పనిచేసే కొన్ని సైబర్ గ్రూప్‌లు వివిధ దేశాల్లో జరిగే ఎన్నికలను ప్రభావితం చేయనున్నాయని.. ఆ గ్రూప్‌లకు ఉత్తర కొరియాలోని మరికొన్ని గ్రూపులు సహాయం అందించనున్నట్లు తెలుస్తోంది.

# లెజెండ్

## తొట్టతొలి భారతదేశ పాశ్చాత్య వైద్యురాలు ఆనందీబాయి జోషి



కాలేజీ సెక్రెటరీ, సూపరింటెండెంట్ సుదూరం నుండి విద్యాభ్యాసానికి వచ్చిన ఆనందీ గోపాలును చూసి ప్రభావితమై ఆమెకు అక్కడ ఉన్న 3 సంవత్సరాలు 600 అమెరికన్ డాలర్లను ఉపకార వేతనం ఏర్పాటు చేసింది. 19వ యేట ఆమె తన వైద్య విద్యను ప్రారంభించారు. అయితే ఆమె అమెరికాలో ఎదుర్కొన్న ప్రధాన సమస్య శీతోష్ణస్థితి. అయినా ఆమెకు కాలేజి వారు ఏర్పాటు చేసిన గదిలో సరైన “ ఫైర్ ప్లేస్ “ లేనందున ఫైర్ ప్లేస్ నుండి అత్యధికంగా పొగరావడం వలన ఆమెకు చలి కాని లేక పొగ కాని భరించ వలసిన పరిస్థితి ఎదురైంది. రెండు సంవత్సరాల అమెరికా వాసం తరువాత ఆమెకు అపస్మారకం, తీవ్రజ్వరం అధికమైంది. అప్పుడు మొదలైన దగ్గు ఆమెను చివరి వరకు వదిలి పెట్టలేదు. ఆమె తీవ్ర ఆరోగ్య సమస్యలతో మూడు సంవత్సరాల ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసి ఫైనల్ పరీక్షలు రాశారు. 1886 మార్చి 11 న ఆమె వైద్య విద్యలో డాక్టరేట్ సాధించింది. ఆమె పరిశోధనాంశం “ఆర్య హిందువులలో స్త్రీ జననాంగ – శిశు సంబంధిత వైద్యం”. స్నాతకురాలయిన సందర్భంలో విక్టోరియా మహారాణి ఆమెకు శుభాకాంక్షలతో ఒక సందేశాన్ని పంపారు. ఆమె పట్టభద్రోత్సవంలో ఆమె భర్త కూడా పాల్గొన్నాడు. ఆ ఉత్సవంలో ఆమెను మొట్టమొదటి భారతీయ వైద్యురాలుగా పేర్కొనడం ఆమెకు మరపురాని అనుభూతిని కలుగజేదిందని ఆమె తన కథనాలలో పేర్కొన్నారు. ఆమె ఆరోగ్యం రోజుకు రోజుకు దిగ జారడంతో ఆమె భర్త ఆమెను ఫిలడెల్ఫియా స్త్రీల ఆసుపత్రిలో చేర్చారు. ఆమెకు క్షయ వ్యాధిగా నిర్ధారించ బడింది. అయినా వ్యాధి ఇంకా ఊపిరి తిత్తులను చేరలేదు. వైద్యులు ఆమెను భారత దేశానికి తిరిగి వెళ్ళమని సలహా ఇచ్చారు. అందుకు ఆమె అంగీకరించింది. కొల్హాపూరు సంస్థానంలో వైద్యురాలిగా పని చేయడానికి వచ్చిన అవకాశాన్ని స్వీకరించింది.

భారత దేశానికి తిరుగు ప్రయాణం చేసే సమయంలో ఆనందీబాయి ఆరోగ్యం మరింత దిగజారింది. నౌకా ప్రయాణం చేసే సమయంలో ఆమెకు చికిత్స చేయడానికి వైద్యులు నిరాకరించారు. వైద్యులు చికిత్స చేయడానికి నిరాకరించడానికి కారణం ఆమె భారతీయురాలు కావడమే. 1886 చివరి భాగంలో, ఆనంది బాయి భారత దేశానికి తిరిగి వచ్చారు. దేశం ఆమెకు ఘనంగా స్వాగతం పలికింది. ఆమె కొల్హాపూర్ సంస్థానానికి వైద్యురాలిగా నియమించ బడింది. అల్బర్ట్ ఎడ్వర్డ్ వైద్య శాలలోని మహిళా వార్డుకు అధికారిణిగా బాధ్యతలను అప్పగించ బడ్డాయి.

కలకత్తా చేరిన తరువాత ఆనందీభాయి బలహీనత, నిరంతర తలనొప్పి, తరచూ జ్వరం, ఆయాసాలతో బాధ పడ్డారు. థియోడిసియా ఆమెకు అమెరికా నుండి ఔషధాలను పంపింది. తరువాత ఆమె ఆయుర్వేద చికిత్స కొరకు కజిన్ ఇంట్లో బసచేసింది. ఆయుర్వేద వైద్య నిపుణుడు ఆమె నౌకాయానం చేసి విదేశాలకు వెళ్ళి సంప్రదాయ సరిహద్దులు దాటినందుకు ఆమెకు చికిత్స చేయడానికి నిరాకరించాడు. భారత దేశానికి తిరిగి వచ్చిన ఒక్క సంవత్సరం లోపుగానే ఫిబ్రవరి 26, 1887 తేదీన 22 సంవత్సరాల చిరుత ప్రాయంలో ఆనందీభాయి వ్యాధి బాధతో తుదిశ్వాస విడిచారు. ఆనందీబాయి మరణానికి దేశం అంతటా విషాదం ఆవరించింది. సాంప్రదాయ హిందూ అంత్యక్రియల కర్మల ప్రకారం దహన సంస్కారాలు జరిగాయి. ఆనందీబాయి చితాభస్మం థియోడిసియా కార్పెంటర్ కు పంప బడింది. కార్పెంటర్ వాటిని పూకిప్సీ, న్యూయార్క్ లోని తమ కుటుంబ శ్మశాన వాటికలో భద్ర పరిచారు. ఆమె సమాధి శిలా ఫలకాన్ని ఈ శ్మశాన వాటికలో ఇప్పటికీ చూడవచ్చు.

అమెరికాలో ప్రసిద్ధ స్త్రీవాద రచయిత, సంస్కరణకర్త అయిన కారోలైన్ వెల్స్ హీలీ డాల్ 1888లోనే ఆనందీబాయి ఆత్మ కథను వ్రాసింది. దూరదర్శన్ ఆనందీబాయి జీవితమును ఆధారముగా చేసుకొని తీసిన ధారావాహిక “ఆనందీ గోపాల్”ను ప్రసారం చేసింది. ఈ ధారా వాహికకు కమలాకర్ సారంగ్ దర్శకత్వం వహించారు. శ్రీకృష్ణ జనార్ధన జోషి తన మరాఠీ నవల “ఆనందీ గోపాల్”లో ఆనందీబాయి జీవితం లోని కొన్ని ఘటనలను పొందు పరిచారు. ఈ నవల ఆషా దామ్లే ద్వారా ఆంగ్లంలోకి సంక్షిప్త రూపంలో అనువాదం చేయ బడింది. అదే పేరుతో రాంజీ జోగ్లేకర్ ఒక నాటకాన్ని కూడా రూపొందించారు. బహుళ మీడియా సంస్థలు ఆమె జీవిత కథను సినిమాలు మరియు సీరియల్స్ లోకి స్వీకరించాయి. ఆనందీ గోపాల్ అనే మరాఠీ బయోపిక్ కూడా విడుదలైంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

## నవ కవిత్వం

### నా అక్షరాలు



అప్పుడప్పుడు
నా అక్షరాలు
నిండు గోదారిలా
పరవళ్ళు తొక్కుతుంటాయి

అప్పుడప్పుడు
నా అక్షరాలు
నిప్పుల కొలిమిలా
కణ కణ మండుతుంటాయి

అప్పుడప్పుడు
నా అక్షరాలు
పిల్లతెమ్మెరలాజి
సేద తీరుస్తుంటాయి


అప్పుడప్పుడు
నా అక్షరాలు
పడిలేచే కడలి కెరటంలా
ఎగిసి పడుతుంటాయి

అప్పుడప్పుడు
నా అక్షరాలు
బాలల భవితకు
ఆరాటపడుతుంటాయి

కాని....ఎల్లప్పుడు
నా అక్షరాలు
సమాజ శ్రేయస్సుకు
పరితపిస్తూనే ఉంటాయి

**కయ్యూరు బాలసుబ్రమణ్యం**
**7780277240**

## లేఖలు




**ముఖచిత్ర కథనం బాగుంది**

దక్షిణ కొరియాలో పిల్లల్ని కనేందుకు మహిళలు దూరం...?! అంటూ ఆదివారం అనుబంధంలో ప్రత్యేక కథనం చాలా బాగుంది. మాకు ఇంతవరకు తెలియని ఎన్నో అంశాలను ప్రస్తావిస్తూ వివరణాత్మకంగా రచించిన సీనియర్ జర్నలిస్టు వివి రావుగారికి ధన్యవాదాలు. ప్రత్యేక వ్యాసం ప్రచురించిన సంపాదక వర్గానికి, సూర్య యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని వ్యాసాలు ప్రచురిం చాలని కోరుకుంటున్నాం. ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవా దాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఓతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**


## ఉగాది ఆశాగీతం




ఉగాది ఉత్సవమా
శ్రీ క్రోధి నామ వత్సరమా
అందుకో మా
ఆశయాల తోరణం
స్వాగతాల ఆభరణం
నవ నాగళ్లతో
పుడమి పులకరిస్తూ
పచ్చదనం కిసలయించే
కర్షక వసంతాన్ని
మాకు ప్రసాదించు
అతివృష్టి అనావృష్టి లేక
పంటచేతి కందే
హరిత విప్లవాన్ని
రమణీయ హేమంతాన్నీ
మాకు ప్రసాదించు
కరోనా మహమ్మారులు రాని
కమనీయ సమాజాన్ని
కనికరాలు దూరం కానీ
రమణీయ సంతోషాన్ని
మాకు ప్రసాదించు
రక్తపాతాన్ని ముద్దాడని
శాంతిసౌధాల ధన్యభూమిని
అలాయి బలాయిలిచ్చుకునే
మానవీయ ధరిత్రిని
మాకు ప్రసాదించు
రాజకీయ రంగుల్ని
హంగుల్ని వొదిలేసి
శోధనలతో..శోభలతో
భవితకు భరోసాను ప్రసాదిస్తూ రా..
అందరూ ఒక్కటేననే
సుందర భావాల నందన వనాన్ని
నిండు మనసుల ఆనంద భువనాన్నీ
ద్వేషాలూ మోసాలూ లేని
వసుధైక కుటుంబాన్ని
కుచ్చితాలు కుతంత్రాలు లేని
మానవతా సుగంధాన్నీ
మాకు ప్రసాదించు...!

**(శ్రీ క్రోది నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ)**


**డా. కటుకోఝ్వల రమేష్**
**:9949083327**










# సూర్య బుడత



**బాలల కథ**



## కోతిపిల్ల - మొసలి



దిలో మొసలికి చెట్టుపైనున్న కోతి పిల్లను తినాలన్న కోరిక కలిగింది .కోతిపిల్ల తల్లి లేని సమయం చూసి మెల్లగా కోతి పిల్లతో మాటలు కలిపింది. "నదికి అటువైపు పళ్ళ తోటలున్నాయి, నా వీపు మీద కూర్చొంటే నిన్ను అక్కడకు తీసుకెళ్తాను " అంటూ చెప్పింది. అమాయకపు కోతి సంతోషంతో మొసలి పైన కూర్చొంది.

నది మధ్యలోకి వెళ్ళాక " అటువైపు పళ్ళ తోటలేదు. నిన్ను తినడానికే అబద్ధం చెప్పి తీసుకొని వచ్చాను " అంది

" నేను ఎలాగూ చనిపోతాను. చివరన ఒక మంచి పని అయినా చేస్తాను నా దగ్గర ఒక వింత వస్తువు వుంది చూడు " అంటూ తనదగ్గరున్న సెల్ ఫోన్ ఆన్ చేసి వీడియో గేమ్స్ పెట్టి మొసలి కళ్ళకు కనపడేలా పట్టుకొంది అమాయకపు కోతి.

మొసలి వీడియో గేమ్స్ చూస్తూ అన్నింటినీ మరచి సీరియస్ గా చూడసాగింది . కోతికి చేయి నొప్పి రావడంతో పొరపాటున జారవిడిచింది . ఫోన్ నదినీటిలో మునిగిపోయింది

"సారీ , మొసలీ అది నీళ్లలో పడితే పనిచేయదు .నా దగ్గర ఇంకొక సెల్ ఫోన్ చెట్టుమీదుంది " "అంది

"వెంటనే తెచ్చివ్వు" అంటూ వెనక్కి తిరిగి కోతిని ఎక్కించుకున్న చోటుకు వేగంగా వచ్చింది.

అమాయకపు కోతి రావడం చూసి "ఎక్కడకు వెళ్ళావు"అడిగింది తల్లి కోతి


తల్లి దగ్గర జరిగిందంతా చెప్పి " సెల్ ఫోన్ తీసుకొని మొసలికి ఇవ్వడానికి వచ్చాను "


" అయ్యో, ప్రియమైన అమాయకపు కోతీ.నీ అమాయకత్వం అలుసుగా తీసుకొని నిన్ను చంపాలనుకొంది. నేటి మానవుల పిల్లల భవిష్యత్తును ,ఆలోచనలను , ఆరోగ్యమును పాడు చేస్తున్న ఈ సెల్ ఫోన్ నాకు దొరికితే వద్దనుకొంటూనే తీసుకొని వచ్చాను. అదృష్టవశాత్తు నీకు తెలీకుండానే ఆ సెల్ ఫోన్ వలన ఆ మొసలి మెదడును మొద్దుబారేలా చేసింది . సెల్ ఫోన్ మీద ఆశతో నిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చింది "అంటూ సెల్ ఫోన్ ఎంతటి ప్రమాదకరమైనదో వివరించింది తల్లి కోతి.

" సెల్ ఫోన్ నన్ను కాపాడినా, చాలా ప్రమాదకరమైనదని తెలుసుకున్నాను ",అంటూ ఆ సెల్ ఫోన్ తీసుకొని నది నీటిలో విసిరివేసింది అమాయకపు కోతి


**(అయిపోయింది)**


**ఓట్ర ప్రకాష్ రావు**
**09787446026**






| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 3 | | | 7 | | | | |
| 6 | | | 1 | 9 | 5 | | | |
| | 9 | 8 | | | | | 6 | |
| 8 | | | | 6 | | | | 3 |
| | | | 8 | | 3 | | | 1 |
| 7 | | | | 2 | | | | 6 |
| | 6 | | | | | 2 | 8 | |
| | | | 4 | 1 | 9 | | | 5 |
| | | | | 8 | | | 7 | 9 |




**మంచిమాట**

తమ తప్పులు
కప్పిపుచ్చుకునేవారు
ఇతరుల తప్పులను
అన్వేషిస్తారు

# ఉగాది స్పెషల్ ప్రత్యేక వంటలు

## "వెరైటీ ఉగాది పచ్చడి"



కావాల్సిన పదార్థాలు:- 1.వేప పువ్వు పావు-అరకప్పు, 2.నువ్వుల పొడి-రెండు స్పూన్లు, 3. పటిక బెల్లం తురుము-ఒక స్పూను, 4.మామిడికాయ ముక్కలు -అరకప్పు, 5.ఉప్పు-చిటికెడు, 6.ఖర్జూర ముక్కలు- పావు కప్పు, 7.పచ్చిమిర్చి ముక్కలు-ఒక స్పూను, 8.చెరుకు రసం-ఒక కప్పు, 9.ఏలుకల పొడి- ఒక స్పూను, 10.మిరియాల పొడి- పావు స్పూను, 11.తేనే-ఒక స్పూను.

తయారు చేయు విధానం:- ఒక వెడల్పు బౌల్ తీసుకొని దానిలో వేప పువ్వు, నువ్వుల పోడి, పటికబెల్లం తురుము, మామిడికాయ మక్కలు, చిటికెడు ఉప్పు, పచ్చిమిర్చి ముక్కలు, ఖర్జుర ముక్కలు, ఏలకుల పొడి, తేనే, మిరియాల పొడి, అన్ని వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. 15 నిమిషాల తర్వాత దీనిలో చెరుకు రసం వేసి బాగా కలపాలి. (చెరుకు రసం వేస్తే పదార్థం లూజు వచ్చి రుచి కూడా అద్భుతంగా ఉంటుంది) దీనిని ఒక పది నిమిషాలు కదలకుండా ఉంచాలి. ఆ తర్వాత దేవునికి నివేదన చేసి ప్రసాదాన్ని తీసుకోవాలి. ఈ "వెరైటీ ఉగాది పచ్చడి" రుచి అద్భుతంగా ఉండి పిల్లలు, పెద్దలు అందరూ గ్లాసులో పోసుకొని ఎంతో ఇష్టంగా ఆరగిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం అందరూ ఆరగించండి.



## వెజిటేబుల్స్ లడ్డు

**కావలసిన పదార్థాలు:-**1. బొంబాయి రవ్వ-ఒక కప్పు, 2.కొబ్బరి తురుము-ఒక కప్పు, 3.క్యారెట్-బీట్రూట్ తురుము- అరకప్పు, 4.కీరా-చిలకడదుంపల తురుము-అరకప్పు, 5.వేగించిన జీడీ-బాదం ముక్కలు-అర కప్పు, 6.ఏలకుల పొడి-ఒక స్పూను, 7.నెయ్యి-ఐదు స్పూన్లు, 8.పాలు-పావు కప్పు, 9.వేగించిన నువ్వులు-రెండు స్పూన్లు, 10.పటిక బెల్లం పొడి-ఒక కప్పు.

**తయారు చేయు విధానం:-** స్టవ్ మీద బాండీ పెట్టి బొంబాయి రవ్వ, కొబ్బరి తురుములని విడివిడిగా వేగించి తీసి ఒక వెడల్పు బౌల్ లోకి తీసుకోవాలి. మరల స్టవ్ మీద బాండీ పెట్టి మూడు స్పూన్ల నెయ్యి వేసి క్యారెట్, బీట్రూట్, కీరా, చిలకడ దంపల తురుములు వేసి పచ్చిదనం పోయేవరకు వేగించి తీసి బొంబాయి రవ్వ వేసిన బౌల్లో వేసుకోవాలి. దీనిలోనే వేగించిన నువ్వులు, జీడిపప్పు ముక్కలు, ఏలకుల పొడి, రెండు స్పూన్ల నెయ్యి, పటిక బెల్లం పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మనకు కావలసిన సైజులో లడ్డుల్లాగా చేసుకోవాలి. మిశ్రమం పొడి పొడిగా ఉంటే కొద్దిగా పాలు కలపాలి లేదంటే వెజిటేబుల్సులో ఉన్న తడి సరిపోతుంది. ఈ లడ్డూల్ని ముందుగా పేపర్ నాప్కిన్ పరచిన ప్లేట్లో పెట్టుకుని ఆ తర్వాత గాలి చొరబడని డబ్బాలో పెట్టుకొని నిలువ చేసుకోవాలి. వెజిటేబుల్స్ లడ్డూలు ఆరోగ్యానికి చాలా మంచిది, రుచి అదుర్స్.

## వేప పువ్వు రోటి పచ్చడి



**కావలసిన పదారదాలు:-**1.వేప పువ్వు-అర కప్పు, 2.టమాటా ముక్కలు-ఒక కప్పు, 3.కొత్తిమీరం పుదీనా-పావు కప్పు, 4.మామిడికాయ ముక్కలు-మూడు స్పూన్లు, 5.తాలింపు గింజలు - మినప్పప్పు-ఒక స్పూను, జీరా-అర స్పూను, ఆవాలు-పావు స్పూను, నువ్వులుంఅవిసె గింజలు- ఒకటిన్నర స్పూన్లు, మెంతులు- కొంచంగా, 6.పచ్చిమిర్చి-ఐదు, 7.ఇంగువ-పావు స్పూను, 8.పసుపు, ఉప్పు, నూనె-తగినంత, 9.కొబ్బరి తురుము-రెండు స్పూన్లు, 10.బెల్లం-చిన్న ముక్క.

**తయారు చేయు విధానం:-**స్టవ్ మీద బాండీ పెట్టి వేప పువ్వు వేసి రెండు నిమిషాలు వేగించి తీసి బౌల్ లోకి తీసుకోవాలి. మరల స్టవ్ మీద బాండీ పెట్టి తాలింపు గింజలు, పచ్చిమిర్చి, తగినంత నూనె వేసి దోరగా వేగించాలి. ఇవి మూడు వంతులు వేగాక దీనిలో ఇంగువ, కొత్తిమీర, పుదీన, కొబ్బరి తురుము, చిన్ని బెల్లం ముక్క వేసి ఒక్క నిమిషం వేగించి తీసి బౌల్ లోకి తీసుకోవాలి. మరల స్టవ్ మీద బాండీ పెట్టి రెండు స్పూన్ల నూనె వేసి టమాట ముక్కలు, ఉప్పు, పసుపు వేసి పచ్చిదనం పోయేవరకు వేగించి చివర్లో మామిడి మొక్కలు కూడా వేసి రెండు నిమిషాలు వేగించి తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు తాలింపు గింజల్ని రోట్లో వేసి మెత్తగా దాంచాలి. తాలింపు గింజలు నలిగాక దీనిలో టమాటా, మామిడి ముక్కల మిశ్రమాన్ని , వేప పువ్వుని కూడా వేసి మరి కొంచెంసేపు దంచి తీసి గాజు బౌల్లోకి తీసుకోవాలి. ఈ వేప పువ్వు రోటి పచ్చడి వేడి వేడి అన్నంలో నెయ్యి జోడించి తింటే ఆ రుచి ఆదరహో. ఈ పచ్చడి బిపి, షుగర్ పేషంట్లకు ఆరోగ్యానికి చాలా మంచిది

## "అటుకుల చిత్రాన్నం"



**కావలసిన పదార్దాలు:-**1.అటుకులు-అర కిలో, 2.క్యారెట్ ముక్కలు- పావు కప్పు, 3.చిక్కుడు గింజలు- పావు కప్పు, 4.బంగాళదుంపముక్కలు-పావు కప్పు, 5.టమాట ముక్కలు-అరకప్పు, 6.బీన్స్ ముక్కలు-పావుకప్పు, 7.కొబ్బరి తురుము-రెండు స్పూన్లు, 8.అవిస గింజలుంనువ్వుల పొడి-ఒకటిన్నర స్పూన్లు, 9.జీడిపప్పు ముక్కలు-పావు కప్పు, 10.ఏలుకల పొడి-ఒక స్పూను, 11.అల్లం పచ్చిమిర్చి ముక్కలు-మూడు స్పూన్లు, 12.తాలింపు గింజలు - మినపప్పు-ఒక స్పూను, శనగపప్పు-ఒక స్పూను, జీలకర్ర-ఒక స్పూను, ఆవాలు- పావు స్పూను, 13.ఎండుమిర్చి-నాలుగు, 14.నూనె, ఉప్పు- తగినంత, 15.పసుపు-పావు స్పూను, 16.ఇంగువ-పావు స్పూను, 17.నెయ్యి-రెండు స్పూన్లు, 18.మామిడి కాయ తురుము-అరకప్పు, 19.నీళు - అరకప్పు, 20.కొత్తిమీర, కర్వేపాకు -మూడు స్పూన్లు, 21. వేగించిన వేరుశనగ గుండ్లు- పావుకప్పు.

**తయారు చేయు విధానం:-** స్టవ్ మీద బాండీ పెట్టి తగినంత నూనె వేసి తాలింపు గింజలు వేసి దోరగా వేగాక ఎండుమిర్చి, ఇంగువ కూడా వేసి ఒక నిమిషం వేగాక పైన చెప్పిన కూరగాయ ముక్కలు, చిక్కుడు గింజలు, జీడిపప్పు ముక్కలు, అల్లం-పచ్చిమిర్చి ముక్కలు, పసుపు, ఇంగువ ముందు కొంచెం ముక్కలకి తగినంత ఉప్పు వేసి బాగా కలిపి కొంచెం నీళ్లు పోసి మూత పెట్టాలి. అడుగంటకుండ మధ్య మధ్యలో కలుపుతుండాలి. ఈ ముక్కలు మూడు వంతులు ఉడికాక కొబ్బరి తురుము, ఏలకుల పొడి, లవంగం పొడి వేసి కలిపి స్టవ్ ని సిమ్ లో పెట్టాలి. ఇప్పుడు అటుకుల్ని శుభ్రంగా కడిగి తగినన్ని నీళ్లు పోసి మూడు నుంచి ఐదు నిమిషాలు నానబెట్టాలి. కొద్దిగా మెత్తబడ్డాక అటుకుల్ని గట్టిగా పిండుతూ బాండిలో ఉన్న ము ముక్కల్లో వెయ్యాలి. ఇలా మొత్తం అటుకులు వేసి ఇంకా నెయ్యి మరి కొంచెం ఉప్పు, మామిడికాయ తురుము, కొత్తిమీర-కరివేపాకు వేసి బాగా కలిపి మరో ఐదు నిమిషాలు ఉడికించి దించి పక్కన పెట్టుకోవాలి. వేరుశనగ గుండ్లతో అలంకరించుకొని దేవుడికి నివేదన చేసి సర్వ్ చేసుకోవాలి. ఈ మిక్సుడు వెజిటేబుల్స్ తో చేసిన అటుకుల చిత్రాన్నం రుచి అద్భుతంగా ఉండి అందరూ ఎంతో ఇష్టంగా తింటారు.

**పింగళి భాగ్యలక్ష్మి**
**కుకరి ఎక్స్పర్ట్,**
**గుంటూరు**
**9704725609**



# అమ్మలాంటి ప్రేమ-నాన్న లాంటి రక్షణ!



అత్తలూరి రామకృష్ణ, చావా మంజుల- క్యాంపస్ కో- ఆర్డినేటర్స్-(KSMA)

**అవును ఈ మాటలు Bishkek (కిర్గిజిస్తాన్) లోని కిర్గి స్టేట్ మెడికల్ అకాడమీ (KSMA) లో మెడిసిన్ చదువుతున్న తెలుగు విద్యార్థుల విషయంలో అక్షరాల నిజం! మా మిత్ర బృందం ఆ క్యాంపస్ లో అడుగుపెట్టినప్పటినుంచి ఏ విద్యార్థిని కదిలించినా వారి నోట వినిపించిన మాట ఇది. పిల్లలు చెప్పడమే కాదు, అక్కడి పరిసరాలు, కాలేజీ క్యాంపస్, హాస్టల్, వారికి అందిస్తున్న ఆహారం, మొదలయిన సౌకర్యాలు చూసిన తరువాత మాకూ అలాగే అనిపించింది. మెడిసిన్ చదవాలనే పిల్లల అభిలాషను కాదనలేని తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఎక్కడో ఖండాంతరాల్లో ఉన్న ఈ కాలేజీకి పంపిస్తున్నారు అంటే... KSMA పట్ల వారికి ఉన్న నమ్మకం ఎంతటిదో అర్థమవుతోంది. ప్రతి ఏటా మన తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశం నలు మూలల నుంచి కూడా వందల సంఖ్యలో పిల్లలు Bishkekలోని కిర్గి స్టేట్ మెడికల్ అకాడమీ (KSMA)లో మెడిసిన్ విద్యనభ్యసించడానికి వస్తున్నారు. అలా ఇక్కడికి వచ్చిన విద్యార్థుల్ని తమ పిల్లలుగా భావించి, వారిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు క్యాంపస్ కో- ఆర్డినేటర్స్ అత్తలూరి రామకృష్ణ గారు, చావా మంజుల గారు. వీరు పది సంవత్సరాల క్రితమే కిర్గిజిస్తాన్ కు వచ్చి, కుటుంబంతో సహా ఇక్కడే స్థిరపడ్డారు. KSMA కాలేజీలో చదువుతున్న మన తెలుగు పిల్లల ఆలనా పాలన దగ్గరుండి మరీ చూసుకుంటున్న రామకృష్ణ గారికి తో,అక్కడి విద్యార్థులతో కాలేజీ క్యాంపస్ లో నేను జరిపిన సంభాషణ నుండి కొన్ని వివరాలు ....**

పింగళి ప్రమీల (కిర్గిజిస్తాన్ నుండి)
స్వతంత్ర పాత్రికేయురాలు
94945 41268



**నమస్కారమండీ రామకృష్ణ గారూ ! హైదరాబాద్ లో ఉన్న మీ ఈ-వింగ్స్ కన్సల్టెన్సీ ద్వారా కిర్గి స్టేట్ మెడికల్ అకాడమీ (KSMA) లో ప్రతి సంవత్సరం ఎంతో మంది విద్యార్థులు చేరుతున్నారు కదా! పిల్లలకి ఇక్కడ మీరు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?**



నమస్తే అండీ! మా ఈ వింగ్స్ కన్సల్టెన్సీ ద్వారా పిల్లలు అడ్మిషన్ తీసుకున్న దగ్గర నుంచి ఫైనల్‌గా వారు డిగ్రీ తీసుకొని ఇంటికి వెళ్లే దాకా ప్రతిక్షణం వాళ్ళకి మేం సపోర్ట్‌గా ఉంటాం. హైదరాబాద్ మా ఆఫీస్ 365 రోజులు పని చేస్తుంది. ఇక కాలేజీ విషయానికి వస్తే ఆడపిల్లలకు, మగ పిల్లలకు, ప్రత్యేక హాస్టల్ వసతి ఉంటుంది. ఇక్కడ ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద అనాటమీ ల్యాబ్ ఉంది. బోధన ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పిల్లలు ఒత్తిడి లేకుండా స్వేచ్ఛా వాతావరణంలో చదువు కుంటారు. వాళ్ళకు డ్రిల్ పీరియడ్ తప్పకుండా ఉంటుంది. ఇంకా మెడికల్ లైబ్రరి, రిసెర్చ్ సెంటర్... ఇలా ఎన్నో ప్రత్యేకతలు మా ఈ కాలేజీ లో ఉన్నాయి. ఇక్కడికి వచ్చాక పిల్లలు రష్యన్, కిర్గి భాషలు కూడా నేర్చేసుకుంటారు. దాని వల్ల వాళ్ళకి భాషా పరమైన ఇబ్బందులు కూడా ఏమీ రావు. మేము Bishkek లోనే ఉంటాం. మా హాస్టల్లో ప్రత్యేకించి నార్త్, సౌత్ చెఫ్స్ ఉన్నారు. మెస్‌లో పిల్లలకి రెండు రకాల భోజనం అందుబాటులో ఉంటుంది. అలాగే హాస్టల్లో ఉండే అమ్మాయిల అవసరాలను మా మిసెస్ మంజుల చూసుకుంటారు. అబ్బాయిలకి ఏదైనా అవసరమైతే నేను చూసుకుంటాను. తెలుగు రాష్ట్రాల పిల్లకు కేర్ టేకర్ గా మ స్టాఫ్ రాహుల్ అందుబాటులో ఉంటాడు. పిల్లలకు ఏ ఇబ్బంది వచ్చినా మేం వెంటనే పరిష్కరిస్తాం.

**ఇక్కడి వాతావరణ పరిస్థితులు వేరు, పండే పంటలు కూడా వేరు కదా! మరి పిల్లలకి మన ఇండియన్ వంటకాలు ఎలా అందించగలుగుతున్నారు?**

అవునండీ! ఫుడ్ విషయానికి వస్తే ఇక్కడ బియ్యం తక్కువగా దొరుకుతాయి. అందుకోసమని పిల్లలకు అవసరమైన బియ్యం, ముఖ్యమైన పప్పు దినుసులు... కంది పప్పు, మినపప్పు ఇవన్నీ కూడా ఇండియా నుంచే తీసుకువస్తాం . ఇడ్లీ, దోశ లాంటి కూడా మేము ఇక్కడ పిల్లల కి చేసి పెడతాం. ఫుడ్ పరంగా చూస్తే, మన ఇంట్లో లేము అనే ఫీలింగ్ ఒక్కరోజు కూడా రాదు వాళ్ళకి. అంత జాగ్రత్త తీసుకుంటాం మేము. ఇక కూరగాయలు ఇక్కడ కొంచెం లిమిటెడ్ గా దొరుకుతాయి. ఎందుకంటే మంచు ప్రాంతం కాబట్టి క్యారెట్, బంగాళదుంప, లాంటివి మాత్రమే ఎక్కువగా పండిస్తారు. టమాట, పచ్చిమిర్చి లాంటివి అక్కడ్నించి తెచ్చుకొని ఇక్కడ నిలువ చేసుకుంటాం. కరోనాకి ముందు మేము ఇక్కడ వ్యవసాయం చేసేవాళ్ళం. సొరకాయ, దోసకాయ, బెండకాయ, లాంటివి పండించేవాళ్ళం. కరోన టైమ్ లో గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇప్పుడు మొదలు పెట్టాలనుకుంటున్నాం.

**పిల్లలకి అనుకోకుండా ఏమైనా ఇబ్బంది వస్తే ఎలా? సెక్యూరిటీ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు? ముఖ్యం గా ఆడపిల్ల విషయం లో సెక్యూరిటీ ఎలా ఉంటుంది?**

ఇది జీరో క్రైమ్ కంట్రీ. 10 సంవత్సరాలుగా నేను ఇక్కడే ఉంటున్నాను. ఇంత వరకు ఒక నేరం కూడా చూడలేదు. లేడీస్ డామినేటెడ్ కంట్రీ కూడా. ఆడపిల్లలకు ఇక్కడ రక్షణ ఎక్కువ. ఇంకా చెప్పాలంటే అర్ధరాత్రి ఆడపిల్ల ఒంటరిగా తిరగగలిగినప్పుడే నిజమైన స్వేచ్ఛ అనే మాట ఇక్కడ ఎప్పటి నుంచో అమలులో ఉంది. ప్రతి ఆడపిల్ల నిర్భయంగా, స్వేచ్ఛగా బయటకు వెళ్ళిరాగలరు. తల్లిదండ్రులు కూడా ధైర్యంగా ఆడపిల్లల్ని ఇక్కడికి చదువు కోసం పంపిస్తున్నారు అంటే కారణం అదే. నేను పనిచేసేది గవర్నమెంట్ కాలేజీ కాబట్టి ఇక్కడ గవర్నమెంట్ పోలీస్ ప్రొటెక్షన్ ఉంటుంది. సీసీ కామెరాల నిఘా కూడా ఉంటుంది. అంతే కాకుండా మా పర్సనల్ సెక్యూరిటీ సపోర్ట్ కూడా ఉంటుంది. పిల్లల నుంచి ఏ క్షణం ఎలాంటి ఫోన్ వచ్చినా 10 నిమిషాల్లోపే మేం వెళ్లి ఆ సమస్యని పరిష్కరించుకుంటాం. సంతోషించాల్సిన విషయమేమిటంటే ఇప్పటివరకు మాకు అలాంటి పరిస్థితి రాలేదు.



**మీ సంస్థ ద్వారా రిజిస్టర్ చేసుకోవడానికి అబ్బాయిలు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారా? అమ్మాయిల సంఖ్య ఎక్కువగా ఉంటోందా? అడ్మిషన్ ప్రాసెస్ ఎలా ఉంటుంది?**

రెండేళ్లకన్నా ముందు అబ్బాయిలు అడ్మిషన్స్ చాలా ఎక్కువ ఉండేవి. గత రెండేళ్లుగా చూసుకుంటే అమ్మాయిల అడ్మిషన్స్ బాగా పెరిగాయి. ఆడపిల్లలకి ఎంబీబీఎస్ చదవాలనే ఆసక్తి పెరగడం కూడా కారణం అయ్యుండొచ్చు. పోయిన సంవత్సరం అడ్మిషన్స్లో 80% మంది అమ్మాయిలున్నారు. మొత్తం మా మూడు కాలేజీలో చూసుకుంటే ఆడపిల్లల అడ్మిషన్స్ పెరిగాయి. కరోనా తర్వాత డాక్టర్స్ అవ్వాలనుకున్న పిల్లల సంఖ్య, అలాగే తల్లి దండ్రుల సంఖ్య కూడా పెరిగినట్లు అనిపిస్తోంది. మొత్తం మన ఇండియా నుంచి ISM EDUTECH సంస్థనున్చి మూడు కాలేజీల్లో సుమారు 1600 వరకు విద్యార్థుల అడ్మిషన్స్ ఉంటాయి. అందులో ఏపీ, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చే పిల్లలు 40 శాతం వరకు ఉంటారు. ఇంకా రాజస్థాన్, యూపీ ఇలా దాదాపు ప్రతి రాష్ట్రం నుంచి పిల్లలు మా కాలేజీల్లో చదువుతున్నారు.

**కరోనా టైమ్ లో క్లాసులు ఎలా నిర్వహించారు?**

అప్పుడు క్లాసులు జరిపించలేదండీ. పిల్లలకి ఇబ్బంది కలగకుండా మేము ఇక్కడ నుంచి స్పెషల్ ఫ్లైట్‌లో పిల్లల్ని వాళ్ళ వాళ్ళ ఇంటికి చేర్చాం. క్లాస్ లు ఆన్‌లైన్‌లో జరిపించాం. పరిస్థితులు చక్కబడ్డాక వెంటనే మళ్లీ ఇక్కడికి తీసుకొచ్చుకున్నాం. మాకున్న మరో ప్రత్యేకత ఏమిటంటే మా కంపెనీ కి ప్రత్యేకంగా ఫ్లైట్ ఉంది. ఇలాంటి ఎమర్జెన్సీ పరిస్థితులు ఏవైనా వస్తే వెంటనే పిల్లల్నితల్లి దండ్రుల దగ్గరకు తీసుకెళ్లగలం. ఇక్కడ ఆ సౌకర్యం మా కంపెనీ కి మాత్రమే ఉంది.

**పిల్లల విషయంలో ఇక్కడి ప్రభుత్వం నుంచి మీకు ఎలాంటి సపోర్ట్ ఉంటుంది?**

మన జాతిపిత మహాత్మా గాంధీ టైమ్ నుంచి ఈ దేశానికి, మనదేశానికి దౌత్య సంబంధాలు చాలా బలంగా ఉన్నాయి. మనదేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ మొదలు ప్రతి ప్రధాని కూడా ఈ దేశాన్ని సందర్శించారు. ఇక్కడ మన ఇండియన్ ఎంబసీ ఉన్నది. పిల్లలకి ఏమైనా ఇబ్బంది వస్తే ఎంబసీ వెంటనే రెస్పాండ్ అవుతారు.

**మీ కాలేజీ ల్లో తెలుగు సిబ్బంది ఎంత మంది ఉంటారు సుమారు ?**

మా మూడు కాలేజీల్లో ఇండియన్ ఫ్యాకల్టీ మరియు స్టాఫ్ కలిపి దాదాపు 50 మంది వరకు ఉంటారు. మేం అందరం పనిని డివైడ్ చేసుకుంటాం. మెస్, పిల్లల సెక్యూరిటీ, వాళ్ళ ఆరోగ్యం, పిల్లలు క్లాసులకు అటెండ్ అవుతున్నారా? లేదా? వాళ్ళ పర్ఫార్మన్స్ ఎట్లా ఉన్నది. ఇలా ఒక్కొక్కరం ఒక్కో బాధ్యత తీసుకుంటాం.

**ఇక్కడ అంటే కిర్గిస్థాన్ లో చదివిన మెడిసిన్ డిగ్రీ కి గుర్తింపు ఉంటుందా!**

ఖచ్చితంగా ఉంటుందండి. అయితే ఇక్కడ మెడిసిన్ డిగ్రీ పూర్తి అయ్యాక, పిల్లలు ఇండియాలో నిర్వహించే FMGE (ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామ్) రాయాల్సి ఉంటుంది. దాని కోసం పిల్లలకి కోచింగ్ కూడా ఇక్కడే ఇప్పిస్తాం. ఆ ఎగ్జామ్ సంబంధించి 19 సబ్జెక్టలలో కోచింగ్ ఇవ్వడం కోసం ఇండియా నుంచిfaculty ని ఇక్కడకు తీసుకొస్తాం. దీనివల్ల పిల్లలు ఇండియాలో NMC నిర్వహించే FMGE పరీక్షకు డైరెక్ట్ గా హాజరు కావచ్చు. ఆ పరీక్ష పాసయిన వాళ్ళు ఇండియా లో ప్రాక్టీస్ చేయడానికి అర్హత సాధించినట్టు.

**ఇక్కడ PG అవకాశాలు ఎలా ఉంటాయి?**

కిర్గిస్థాన్లోని మా రెండు కాలేజీలు- ఇంటర్నేషనల్ హైయర్ స్కూల్ మెడిసిన్ (ISHM), కిర్గి స్టేట్ మెడికల్ అకాడమీ (KSMA%) UK PG ప్రోగ్రామ్ తో టైఅప్ అవడం వల్ల అటు UK లోనూ, కిర్గిస్థాన్ లోనూ, ఇటు ఇండియాలోనూ మా PG డిగ్రీ పరిగణలోకి తీసుకోబడుతుంది.

**పిల్లల్ని పరాయి దేశానికి పంపిస్తున్నాం అంటే ముఖ్యంగా అమ్మాయిల విషయంలో తల్లిదండ్రులకు భయం ఉంటుంది. ఆడపిల్లల ఆరోగ్యం, భద్రత విషయంలో మీరు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?**


మా కంపెనీ కి ఇక్కడ “వేదాంత” అని స్వంత హాస్పిటల్ ఉంది. పిల్లలకు ఏమైనా ఇబ్బంది ఉంటే అక్కడికి తీసుకువెళ్తాం. ఈ సంవత్సరం కిర్గిస్థాన్ ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. దాని ప్రకారం ప్రతి ఫారిన్ స్టూడెంట్ సంవత్సరానికి 200 డాలర్లు కడితే వాళ్ళకి హెల్త్ ఇన్సురెన్స్ సౌకర్యం కల్పిస్తోంది. ఎలాంటి సమస్య వచ్చినా దీని ద్వారా పిల్లలకి ట్రీట్‌మెంట్ జరిగేట్టు ఒప్పందం కుదిరింది. ఆడపిల్ల అయినా మగపిల్లలైనా తల్లిదండ్రులకు ఒకటే కాబట్టి ఇక్కడికి వచ్చిన పిల్లల్ని మేము మా సొంత పిల్లలాగా చూసుకుంటాము. మీరన్నట్టు ముఖ్యంగా ఆడపిల్లల విషయానికి వచ్చేసరికి తల్లిదండ్రులకి కొంచం ఎక్కువ భయం ఉంటుంది. అమ్మాయిల విషయంలో వారికి ఏ అవసరం వచ్చినా సహాయం చేయడానికి మేముఎప్పుడూ అందుబాటులోనే ఉంటాం. ముఖ్యంగా ఈ దేశం లేడీస్ డామినేటెడ్ కంట్రీ అని చెప్పాలి. ఎందుకంటే వాళ్ళకి రక్షణ ఎక్కువ ఉంటుంది. అలా పిల్లలు ఏ క్షణం, ఎప్పుడు ఫోన్ చేసినా మేము రిసీవ్ చేసుకోవడానికి సిద్ధంగా ఉంటాం. ఏదైనా సమస్య ఉన్న వెంటనే వెళ్లి పరిష్కరిస్తాం. దండ్రులు మమ్మల్ని నమ్మి పిల్లల్ని ఇక్కడికి పంపించారు కాబట్టి, మేము 365 రోజులు, 24 గంటలు ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటాం.

**చాలా సంతోషమండీ ! ధన్యవాదాలు !**




# సైన్స్ ఆధారంగా తొలి ప్రపంచ పటం

## గడప దాటకుండానే చిత్రించిన సన్యాసి... ఈ అద్భుతాన్ని ఎలా సాధించారు...?




**ఫ్రా మౌరో గురించిన విషయాలు పెద్దగా తెలియవు. ఆయన సాధువుగా మారకముందు ప్రపంచమంతా తిరిగారని నమ్ముతారు. కానీ ఆయన మ్యాప్‌లు గీయడానికి ప్రయాణాలు చేయలేదు. వెనిస్ నగరం అప్పట్లో నావికాశక్తిగా ఉండేది. అనేక సంస్కృతుల సమావేశాలకు వేదికగా ఉండేది. దీనివల్ల ఫ్రామౌరోకు తత్త్వవేత్తలు, భౌగోళిక విజ్ఞానం కలిగినవారు, మ్యాప్‌లను గీసేవారు, ముస్లింలు, ఇథోపియన్ ప్రతినిధులతో కూడిన నావికుల నుంచి సమాచారాన్ని సేకరించగలిగారు. ఆయన వద్ద పెద్ద సంఖ్యలో పుస్తకాలు, మ్యాప్‌లు ఉండేవి. ఫలితంగా ఆ సమయంలో లభించిన భౌగోళిక సమాచారం ఆధారంగా ఈ మ్యాప్‌ను రూపొందించారు. దీనిని 3వేలకు పైగా వ్యాఖ్యానాలతో తీర్చిదిద్దారు. వాటిల్లో కొన్ని ప్రాంతాల ఆచారాలు, భౌగోళిక వివరాలు ఉన్నాయి. వాటితో పాటు కొన్ని ప్రాంతాల చిత్రీకరణలో తాను ఎలాంటి స్వేచ్ఛ తీసుకున్నదీ కూడా వివరించే ప్రయత్నం చేశారు.**




1457 నుంచి 1459 మధ్యన ఈ ప్రపంచ పటాన్ని గీసినట్టుగా భావిస్తున్నారు

ఆయనో సన్యాసి. ఆయనేమీ ప్రపంచాన్ని చుట్టి రాలేదు. ఇందులో ప్రత్యేకత ఏముందునే అనుమానం కలగక మానదు. ఆ సన్యాసే ప్రపంచ పటాన్ని తయారు చేశారు. ఆ మ్యాప్ మధ్యయుగానికి చెందిన ఒక అద్భుతంగా గుర్తింపు పొందింది. మామూలుగా అన్నిమ్యాప్‌లలో ఉత్తర దిక్కు పైన ఉంటుంది. వెనిస్‌లో 15వ శతాబ్దంలో రూపొందిన ఈ మ్యాప్‌లో దక్షిణ దిక్కువైపు ఉంది. ఈ మ్యాప్ రూపొందించిన వ్యక్తి భూగోళమంతా ఏమీ తిరగలేదు. తాను నివసించే మఠం నుంచి కాలు బయట పెట్టకుండానే ఈ పని చేశారు. ఈ మ్యాప్ వెనిస్ మ్యూజియంలో నేటికీ దర్శనమిస్తోంది. నీలం, బంగారు వర్ణంలో వృత్తాకారంలో రెండుమీటర్ల వ్యాసార్థం ఉన్న ఎండిన చర్మంపై గీసిన ఈ మ్యాప్ ఓ చెక్కకు బిగించారు. ఈ మ్యాప్ సృష్టికర్త పేరు ఫ్రా మౌరో. ఆయన 15వ శతాబ్దం మధ్యలో రూపొందించిన ఈ పటం మన విశ్వం ఎలా ఆవిర్భవించిందో తెలియజేస్తుంది. అలాగే ఖండాలు, సముద్రాల గురించిన వ్యాఖ్యానాలు, చిత్రాలు కూడా ఇందులో పొందుపరిచి ఉన్నాయి. పోర్చుగల్ రాజు అల్ఫాన్సో ఆదేశాలతో 1459లో రూపొందిన ఈ మ్యాప్ పురాణాలు, మూఢనమ్మకాలను దాటి పరిశీలనాత్మక దృక్పథంతో చిత్రీకరించినదిగా భావిస్తున్నారు.

### తలకిందులుగా...

ఫ్రా మౌరో గీసిన ఈ మ్యాప్ ప్రపంచాన్ని తలకిందులుగా చూపుతోంది. ఆ మ్యాప్‌లో దక్షిణ దిక్కు పైన ఉంటుంది. ఉత్తరం దిక్కు నుంచి ప్రపంచాన్ని చూడటానికి అలవాటుపడిన మనం అంత త్వరగా ఇందులోని యూరోప్, ఆసియా, ఆఫ్రికా ఖండాలను గుర్తించలేం. నిజానికి ఉత్తరం దిక్కు ఎప్పుడూ ఊర్ధ్వముఖానికి పర్యాయంగా చెప్పలేదు. అలాగే మ్యాప్‌ల చిత్రీకరణ అనేది కాలానుగుణంగా



నాసా ఉపగ్రహాలు ఆక్వా, టెర్రా తీసిన కాంపోజిట్ చిత్రంతో ఫ్రా మౌరో ప్రపంచ పటం పోలిక)

(మిగతా 8వ పేజీలో)

(7వ పేజీ తరువాయి)

అలాగే మ్యాప్‌ల చిత్రీకరణ అనేది కాలానుగుణంగా మారుతూ వచ్చాయి. ఫ్రా మౌరో కాలం నాటి ఇస్లామిక్ మ్యాప్‌లలో కూడా దక్షిణం దిక్కే ఊర్ధ్వముఖంగా ఉండేది. దీంతో మౌరో ఈ విధానాన్ని పాటించారనడంలో ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. పైగా అప్పటి నౌకాన్వేషణలన్నీ దక్షిణం దిక్కుకు సాగేవి. అప్పట్లో యూరోపియన్ మ్యాప్‌లు కూడా భిన్నమైన విధానాన్ని అనుసరించేవి. వీటికి గార్డెన్ ఆఫ్ ఈడెన్ దిక్సూచిగా ఉండేది. వాస్తవానికి ఆనాటి మ్యాప్‌లలో భౌతిక స్వర్గానికి కూడా చోటు కల్పిస్తుండేవారు. ఇది మ్యాప్‌లలో పై భాగాన ఉండేది. కానీ ఫ్రా మౌరో దానిని తొలగించాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. మ్యాప్‌లు రూపొందించడంలో ఆనాటి సంప్రదాయ విధానానికి భిన్నంగా ఈ భౌతిక స్వర్గాన్ని ఆయన మ్యాప్‌లో ఓమూలన పడేశారు. అయితే తానెందుకిలాంటి నిర్ణయం తీసుకున్నారో ఓ లాంగ్‌నోట్‌లో వివరించారు. అందులో సెయింట్ అగస్టిన్ చెప్పిన స్వర్గమంటే ఏమిటో తన ధోరణిలో వివరించారు. "అది కేవలం ఆధ్యాత్మికమైన అర్థాన్ని మాత్రమే ఇవ్వదు. భూమిపైన నిజంగానే ఆ ప్రాంతం ఉంది" అని చెప్పారు కానీ, ఆ ప్రాంతం మానవ ఆవాసాలకు, వారి ఎరుకకు అందనంత దూరంలో ఉందని రాశారు. దీంతోపాటు ఫ్రా మౌరో అప్పటి మ్యాప్‌లలో మధ్యభాగంలో కనిపించే జెరూసలెం ప్రాంతాన్ని కూడా కొత్తచోటుకు మార్చారు. ఆయన జెరూసలెంను ఆసియా, యూరోప్, ఆఫ్రికా ఖండాల మధ్య భాగాన కొద్దిగా పశ్చిమం వైపుగా జెరూసలెం ప్రాంతాన్ని గీశారు. "జెరూసలెం అనేది కచ్చితంగా మానవావాసాలకు కేంద్రంగా ఉన్న భూ అక్షాంశ ప్రాంతం. కానీ రేఖాంశంగా చూస్తే అది పశ్చిమానికి కొంచెం దగ్గరగా ఉంది." అని ఆయన వివరించారు. మతపరమైన దృక్పథాలను దాటి పరిశీలనా దృష్టితో శాస్త్రీయ పద్ధతిలో మ్యాప్‌లు గీయడానికి ఫ్రామౌరో నిర్ణయాలు దోహదపడ్డాయి.




ఈ మ్యాప్‌లోని ఓ మార్గం పోర్చుగల్‌లో మొదలై ఆఫ్రికా ఖండాన్ని చుట్టి, హిందూ మహాసముద్రంలో ముగుస్తుంది.)



## కాలు బయట పెట్టకుండానే...

ఫ్రా మౌరో గురించిన విషయాలు పెద్దగా తెలియవు. ఆయన సాధువుగా మారకముందు ప్రపంచమంతా తిరిగారని నమ్ముతారు. కానీ ఆయన మ్యాప్‌లు గీయడానికి ప్రయాణాలు చేయలేదు. వెనిస్ నగరం అప్పట్లో నావికాశక్తిగా ఉండేది. అనేక సంస్కృతుల సమావేశాలకు వేదికగా ఉండేది. దీనివల్ల ఫ్రామౌరోకు తత్త్వవేత్తలు, భౌగోళిక విజ్ఞానం కలిగినవారు, మ్యాప్‌లను గీసేవారు, ముస్లింలు, ఇథోపియన్ ప్రతినిధులతో కూడిన నావికుల నుంచి సమాచారాన్ని సేకరించగలిగారు. ఆయన వద్ద పెద్ద సంఖ్యలో పుస్తకాలు, మ్యాప్‌లు ఉండేవి.




ఫ్రామౌరో ప్రపంచ పటం మూలలో స్వర్గాన్ని చిత్రించారు

ఫలితంగా ఆ సమయంలో లభించిన భౌగోళిక సమాచారం ఆధారంగా ఈ మ్యాప్‌ను రూపొందించారు. దీనిని 3వేలకు పైగా వ్యాఖ్యానాలతో తీర్చిదిద్దారు. వాటిల్లో కొన్ని ప్రాంతాల ఆచారాలు, భౌగోళిక వివరాలు ఉన్నాయి. వాటితో పాటు కొన్ని ప్రాంతాల చిత్రీకరణలో తాను ఎలాంటి స్వేచ్ఛ తీసుకున్నదీ కూడా వివరించే ప్రయత్నం చేశారు. "ఏదైనా ప్రాచీన లేదా లిఖిత జ్ఞానాన్ని ప్రత్యక్ష అనుభవంతో పరిశీలించాల్సిందే. టాలమీ, అరిస్టాటిల్ లాంటివారు రాసినవి కూడా విమర్శనాత్మకంగా చూడకుండా కేవలం గుడ్డిగా నమ్మలేం" అని అని నేషనల్ రీసెర్చ్ కౌన్సిల్ ఆఫ్ ఇటలీలో పరిశోధకునిగా ఉన్న ఏంజెలో కాటానియో చెప్పారు. కాటానియో యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరెన్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

## ఆ చిత్రాల్లో ఊహాజనిత కథలకు చోటు లేదు


ఫ్రా మౌరో గీసిన మ్యాప్‌లో ఊహాజనిత గాథలకు చోటు కల్పించలేదు. ఆయన దెయ్యాలు, భారీ జంతువుల గురించిన వివరణలకు ఎటువంటి అవకాశం ఇవ్వలేదు. ఆ కాలంలో అనేక కథనాలు ప్రాచుర్యంలో ఉండేవి. కానీ వాటిని ఫ్రా మౌరో అపోహలుగానే భావించినట్టు తెలుస్తోంది. అందుకే ఈ మ్యాప్‌లో మధ్య యుగాల నాటి సముద్ర సర్పాలు, ఇతర పురాణ ప్రాణులు ఎక్కడా కనిపించవు. అలాగే తెలియని ప్రాంతాల పరిమితులను, ప్రమాదాల గురించి హెచ్చరిస్తుంది. తనతో మాట్లాడిన ప్రయాణికులెవరూ రాక్షసుల గురించిన కథనాలు చెప్పలేదని, అందుకే ఈ పరిశోధనను ఇలాంటి విషయాలు తెలుసుకోవాలనుకునేవారి ఆసక్తికే వదిలివేస్తున్నట్టు ఫ్రా మౌరో వెల్లడించినట్టు ఆధారాలున్నాయి. అయితే కేవలం ఈ మ్యాప్ గురించిన వివాదాన్ని ఆయన పరిష్కరించారు. ఇక మ్యాప్‌లో సముద్ర మధ్యభాగంలో తీవ్రమైన అలలు, సుడిగుండాలు కనిపిస్తాయి. మ్యాప్‌లో ఫ్రా మౌరో తన వివరణలకు, వివరణలకు మధ్యన ఊహాజనిత మార్గాలను కనిపెట్టి, వాటితో ప్రపంచాన్ని అనుసంధానించడం ద్వారా తన దూరదృష్టిని బయటపెట్టారు. వరల్డ్ మ్యాప్‌లను ఏళ్ళ తరబడి అధ్యయనం చేస్తున్న ఏంజెలియో కాటానియో ప్రకారం, "ఈ మ్యాప్ ఆ సమయంలో ప్రాంతాల అనుసంధానానికి సంబంధించిన ఓ ఊహాజనిత ప్రాజెక్ట్" అని వివరించారు. ఫ్రా మౌరో కాలంలో వరుసగా జరిగిన చారిత్రక ఘటనల వల్ల, చైనాలో మంగోలియా రాజ్యవంశ పతనం, మధ్యధరా సముద్రాన్ని తుర్కులు దిగ్బంధించడం, యూరప్‌లో బ్లాక్ డెత్ (ప్లేగు మహమ్మారి కారణంగా మరణాలు) భూమార్గాలకు అంతరాయం కలిగినట్టు కనిపిస్తుంది.



## ప్రత్యామ్నాయ మార్గం

ఈ మ్యాప్ ఒక ప్రత్యామ్నాయ సముద్ర మార్గాన్ని కూడా ప్రతిపాదించింది. క్లిష్టమైన వెనిస్ లాంటి నదీ తీర ప్రాంతాలలో నివసించేవారికీ ఇలాంటి ఆలోచన రావడం అసాధ్యమైన విషయ-ఏమేమీ కాదు. ఈ ప్రతిపాదన తొలి భౌగోళిక శాస్త్రవేత్తగా పరిగణించిన టాలెమీ భావనలకు విరుద్ధంగా ప్రారంభమవుతుంది. టాలెమీ వాదనకు భిన్నంగా ఫ్రా మౌరో హిందూ మహా సముద్రం భూ పరివేష్టితం కాదని, అది ఓపెన్ సీ అని వాదించారు. అలాగే ఆఫ్రికా అగ్నేయం వైపు అనంతంగా విస్తరిస్తున్న ఖండం కాదని వాదించారు. ఫ్రా మౌరో తన వాదనలకు నావికుల కథనాలను ఆధారంగా చేసుకున్నారు. దాంతోపాటు ఆ సమయంలో మ్యాప్‌లు ఏం చెబుతున్నాయి, అనుభవపూర్వక పరిశీలనలు ఎలా ఉన్నాయో కూడా తెలుసుకునేవారు.

పోర్చుగీసు అన్వేషకులు ఆఫ్రికా తీరం వెంబడి చేసిన తొలినాటి ప్రయాణాలను ఈ మ్యాప్ సూచిస్తుంది. వారు 2వేల నాటికల్ మైళ్ళకుపైగా ప్రయాణించారని ఇది తెలుపుతుంది. ఇందుకు నాటికల్ పటాలలో వర్ణించిన, ఉత్తర ధృవాన్నీ చూడగలిగిన కాబోరోస్సో అనే ప్రాంతాలను ఆధారంగా చేసుకుని చిత్రించారు. ఇక పటంలోని రెండో మార్గం తూర్పు నుంచి 2వేల మైళ్ళు ప్రయాణించి ఇథియోపియాలోని దక్షిణ ప్రాంతానికి చేరుకున్న చైనా నౌకల కథల ఆధారం చేసుకుని రూపొందించినది. ఈ రెండు మార్గాలను కలపడం ద్వారా ఆఫ్రికాను చుట్టిరావడం సాధ్యమేనని చెప్పారు. ఈ ప్రతిపాదన చేసిన అర్థశతాబ్దం తరువాత పోర్చుగీసు నావికుడు బార్టోలో మ్యూ డయాస్, కేప్ ఆఫ్ న్యూ హోప్‌కు 1488లో చేరడం ద్వారా దీనిని ధృవీకరించారు. ఈ ప్రపంచ పటంలో హిందూ మహాసముద్రంలో భారీగా సాగిన నౌకాయానం




గురించి కూడా వివరించింది. చైనా, అరబ్ నౌకలు ఎర్రసముద్రం, పర్షియన్ గల్ఫ్ మధ్యన విలాసవస్తువుల రవాణా చేస్తుండేవి. మార్క్ పోలో వర్ణించిన చైనా నౌకలను ఈ మ్యాప్‌లో మొదటిసారి చిత్రాల రూపంలో చూపించారు.

"ఈ నౌకలను జోంచి అని పిలిచేవారు. వీటిపైన పొడవాటి నాలుగు స్తంభాల్లాంటివి ఉండేవి. ఇవి కొన్ని మరీ పొడవుగా, మరికొన్ని పొట్టిగా ఉండేవి. వీటిల్లో వ్యాపారుల కోసం 40 నుంచి 60 గదులు ఉండేవి. ఒక చుక్కాని ఉండేది. అవి దిక్సూచి లేకుండానే ప్రయాణించేవి. వారికి ఓ జ్యోతిష్యుడు ఉండేవాడు. ఆయన డెక్ పైన నిలబడేవాడు. ఆయన తన చేతిలోని దిక్సూచి లాంటి పరికరాన్ని అనుకరిస్తూ నావికుడికి ఏ మార్గంలోకి వెళ్ళాలో చెప్పేవారు." ఆయన తన మ్యాప్‌లో రాశారు.

హిందూ మహాసముద్రం, మధ్యధరా సముద్రం, ఆఫ్రికా చుట్టూ తిరిగే ఊహాజనిత మార్గంతో ఆసియాలో చాలా చురుగ్గా ఉండే వాణిజ్య మార్గాలను ప్రపంచ పటంలో ఏకం చేయడమనే ఫ్రామౌరో మనోభిలాష ఈ ప్రపంచ పటంలో ఆవిష్కృతమవుతుంది. ఈ మార్గాన్ని అనుసరించి జపాన్, జావా, చైనాలోని క్వాన్జాహూ నుంచి మధ్యధారా నగరాలైన ఏథెన్, మక్కా, హర్మోజ్ తో పాటు లిస్బన్, వెనీస్ లాంటి యురోపియన్ నగరాలకు కూడా ప్రయాణించవచ్చు. ప్రపంచ పటంలో వివరంగా గీసిన నదీ,భూమార్గాలను ఈ పటానికి జోడిస్తే ఇది ప్రపంచాన్ని అనుసంధానించే స్కెచ్‌గా అర్థమవుతుంది. ఫ్రా మౌరో అప్పటి ప్రపంచం ఎలా ఉందో చూపడానికి మాత్రమే పరిమితం కాలేదు. వెనీస్ నుంచి కదలకుండానే ఆయన భవిష్యత్‌లో ప్రపంచం ఎలా ఉండాలనే దార్శనికతను కూడా ఆవిష్కరించారు. 'కాస్మోగ్రాఫర్ సమాచారాన్ని సేకరించేవారు. కానీ అది విరుద్ధంగా ఉండేది. తన దృక్పథానికి సరిపడా స్పష్టమైన సమాచారాన్ని ఎంచుకునేవారు. ఇది ఆదర్శవాదం. ఇది ప్రపంచాన్ని అర్థం చేసుకునే విధానం. ఫ్రా మౌరో తన ప్రపంచ పటంలో రాసింది అదే" అంటారు కాటానియో.

**– వి.వి.వెంకటేశ్వరరావు, ఫ్రీలాన్స్ జర్నలిస్టు.**
**63008 66637.**

# గురుశిష్యులు (మినీ కథ)

మోహన్ మాస్టారు నిజంగా మోహనాకారుడే. తన స్ఫురద్రూపంతోనే కాదు, తన వాక్చాతుర్యంతో విద్యార్థులను ఇట్టే ఆకట్టుకోగలరు. విశాలమైన పాఠశాలలో పనిచేస్తున్న మోహన్ అంతే విశాల హృదయంతో తన దగ్గర విద్యను అభ్యసిస్తున్న పిల్లలను ప్రేమతో సాకుతారు. అందుకే మోహన్ మాస్టారు అంటే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ వల్లమాలిన అభిమానం, ప్రేమ. గంభీరమైన గొంతుతో, విశేషమైన అర్థ వివరణతో తను పాఠ్యాంశాలు చెబుతుంటే, తరగతి గదిలోని పిల్లలు తమను తాము మైమరచిపోతూ వినడం కద్దు. అంతేనా అంటే కాదు. మాస్టారు గొంతెత్తి పాటలు పాడితే పిల్లల హృదయ మందిరాలు ఆ గాత్ర మాధుర్యంలో తడిసి ముద్దై పరవశించక మానవు.

మాస్టారు పనిచేసే బడిని అనాదిగా 'ఆటలబడి' అని అంటారు. సాయంత్రం వేళ అదొక క్రీడా పాఠశాలలా మారిపోతుంది. పిల్లలంతా ఆటల సంబరాల్లో మునిగితేలుతుంటారు. ఒకపక్క వాలీబాల్, మరోపక్క బ్యాడ్మింటన్, ఇంకో పక్క కబడ్డీ ఆడుతూ పిల్లలు సరదాగా తమ స్నేహితులతో గడుపుతుంటారు. ఉజ్జిఉజ్జీలుగా పిల్లలు రన్నింగ్ ట్రాక్ మీద జాగింగ్ చేస్తూ కనబడుతుంటారు. ఉపాధ్యాయులైతే ఈవినింగ్ వాక్ చేస్తుంటారు కూడా. మోహన్ మాస్టారు కూడా రకరకాల ఆటల్లో పిల్లలతో మమేకమవుతూ ఉంటుంటారు. బడి అంటే ఒక చదువే కాదు, సకల విద్యలకు నిలయమయ్యేది, నేర్పేది అని నమ్మే వారిలో మోహన్ మాస్టారు ఒకరు. అందుకే అనేక సహపాఠ్యేతర కార్యక్రమాలలో పిల్లలు పాలుపంచుకునేలా అతను ప్రోత్సహిస్తుంటారు. ఇదిలా ఉంటే ఒక రోజు మోహన్ సార్ పదవ తరగతిలో యధావిధిగా పాఠం చెబుతుండగా చివరలో విద్యార్థులను ఉద్దేశించి ఇలా అన్నారు. నేను రేపు ఆదివారం మీ ఊరిలో జరగబోవు మా బంధువుల కార్యక్రమానికి నా భార్యను తీసుకొని వస్తున్నాను. అయితే మీలో ఎవరి ఇంటికి రావాలి? అని అడిగారు. దానికి విద్యార్థులంతా మా ఇంటికి రండి సార్%ొా%మా ఇంటికి రండి సార్%ొా%అని చేతులెత్తి ఆహ్వానించడం జరిగింది. కానీ జానకి అనే అమ్మాయి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఆమె ముఖం దించుకొని అలానే ఉండిపోయింది. దాంతో మోహన్ మాస్టర్ అందరినీ గమనిస్తూ, బాగానే ఉంది. అందరూ మమ్మల్ని ఆహ్వానించారు. సంతోషమే కానీ, ఒక్క జానకి మాత్రం ఎందుకో చేయి ఎత్తలేదు. కారణం ఏమై ఉంటుంది? అని ప్రశ్నించారు. దానికి జానకి సిగ్గుపడుతూ, సార్ మా ఇల్లు బాగోదు. మా ఇల్లు మీకు నచ్చదు. అందుకే సార్ మిమ్మల్ని నేను పిలవలేకపోయాను అని అంది. దానికి వెంటనే మాస్టారు అలానా! సరే అయితే, నువ్వు పిలవలేదు కాబట్టి మేం మీ ఇంటికే వస్తాం. మరి ఎవరి ఇంటికీ వెళ్ళం అని అంటూ క్లాస్ నుంచి నిష్క్రమించారు. కానీ జానకికి మాత్రం అనుమానమే. ఎందుకంటే మాస్టారు మాలాంటి వారి ఇంటికి వస్తారా! అతను ఎక్కడ? మేమెక్కడ? అనే సందిగ్ధంలో ఉంటూ, మాస్టారు ఏదో దివి నుండి భువికొచ్చిన మనిషని అనుకుంది.

మరుసటి రోజు ఉదయం మాస్టారు తన భార్యను తీసుకొని తాను పనిచేస్తున్న గ్రామానికి వచ్చారు. అక్కడ తన బంధువుల ఇంట జరిగిన శుభ కార్యక్రమానికి హాజరై, తన పాఠశాలను కూడా భార్యకు చూపించారు. ఆమె కూడా పాఠశాలను చూసి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే, ఆమె ఎప్పుడూ అంత పెద్దదైన పాఠశాల ప్రాంగణాన్ని చూడలేదు కాబట్టి. అదే విషయాన్ని ఆమె మోహన్ సారుతో పంచుకున్నారు. తదనంతరం తిరిగి వెళుతున్న క్రమంలో మోహన్ మాస్టారు తన భార్యతో సహా జానకి వాళ్ళ ఇంటికి వెళ్లారు. వెళ్లేసరికి ఆమె లేదు. వాళ్ల నాన్నమ్మ ఉంది. నేను మీ మనవరాలకి విద్యాబుద్ధులు చెబుతున్న టీచర్ని అని మోహన్ సార్ ఆమెతో చెప్పేసరికి, ఆమె అక్కడెక్కడో దగ్గరలో ఉన్న జానకిని పిలవడానికి వెళ్లి వెంటబెట్టుకొచ్చింది. అంతే! జానకి ఆశ్చర్యపోయింది. శ్రీకృష్ణుడి ఇంటికి కుచేలుడు వచ్చేటప్పుడు కన్నయ్య ఎంత సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యేడో! తెలియదు గానీ, ఒకవేళ కుచేలుడు ఇంటికి శ్రీకృష్ణుడే వస్తే! ఆ బీద బ్రాహ్మణుడు ఎంతటి దివ్యానుభూతికి లోనవుతాడో! అంతటి అనుభూతిని జానకి పొందడం అక్కడ వారంతా పసిగట్టారు. అంతే జానకికి అప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు. తన మాస్టారుని, గురువమ్మని ఎలా గౌరవించాలో! తెలియక తడబాటుకులోనైంది. అంతలోనే తేరుకొని తన ఇంట్లో అందుబాటులో ఉన్న ఆసనం మీద వారిరువురిని కూర్చుండబెట్టింది. వెంటనే తన నాన్నమ్మకు చెప్పి వీధిలో ఉన్న అంగడికి పంపి ఓ నల్లని కూల్ డ్రింక్ తీసుకొచ్చింది. అది చూసి మాస్టర్ ఇలా అన్నారు. జానూ%ొా%నాకు ఇష్టమైన డ్రింక్ ఇదే! అని నీకు ఎలా తెలుసు? అని అన్నారు. దానికి జానకి ఇలా అంది. సార్%ొా% ఇదివరలో నేను మీరు ఈ డ్రింక్ ని ఇష్టంగా తీసుకోవడం చూశాను. అందుకే అదే డ్రింకు తెప్పించానని అంది. ఓహో! అదా! ఒక్కోసారి మన పాఠశాలలో ఏదైనా లంచ్ పార్టీ జరిగితే, నేను అప్పుడు ఈ డ్రింక్ ను త్రాగుతుంటాను. దాన్ని నువ్వు గమనించి ఉంటావు. ఉపాధ్యాయుల అలవాట్లను విద్యార్థులు దగ్గరగా గమనిస్తుంటారంటారు. ఉపాధ్యాయులు అందుకే చాలా జాగ్రత్తగా విద్యార్థుల ముందు మెలగాలి అంటూ, ఓకే జానూ థాంక్యూ%ొా%అని మాస్టారు అన్నారు.

అంతే మాస్టారు జానూ%ొా%అని జానకిని ప్రేమతో దగ్గరకు పిలుస్తూ%ొా%అమ్మా! నీవేమీ ఆత్రుత పడకు. మేమేమీ? ఆకాశం నుంచి ఊడిపడలేదు. మాకు ఏమీ రెండు కొమ్ములు లేవు. మేము కూడా మామూలు మనుషులమే. మీలాంటి వాళ్లమే. అష్టకష్టాలు పడి మా తల్లిదండ్రులు మమ్మల్ని చదివించి ఇంతటి ప్రయోజకులను చేశారు. వారి త్యాగమే మమ్మల్ని ఈ రోజు మీ ముందు గొప్పవారిగా నిలబెట్టింది. అంతే తప్ప మేమేమీ గొప్ప కాదు. వేరు అసలే కాదు. అది నువ్వు గుర్తుంచుకో. మనలాంటి పేద, మధ్యతరగతి వర్గాల వారికి చదువే ఆసరాగా ఉంటుంది. విద్యయే మన తాలూకా జీవన నేపథ్యాలను మెరుగుపరుస్తుంది. అదే మనల్ని అందరిలో గొప్పగా నిలబెట్టుతుంది. అందువల్ల నువ్వు కూడా చక్కగా చదువుకొని, ఉన్నతమైన స్థితిని సంపాదించు. అప్పుడు నీవు పెద్ద ఇల్లు కట్టుకోగలవు. మీ అమ్మానాన్నలను అందులో ఉంచి చక్కగా చూసుకోగలవు. నీ తల్లిదండ్రులకే కాదు, నీ ఊరికి కూడా పేరుప్రఖ్యాతులు తీసుకురాగలవని మోహన్ సార్ జానకిని ఆశీర్వదించారు. అలా అంటూ జానకి వాళ్ళ నాన్నమ్మతో మాస్టారు ఇంకా ఇలా అన్నారు. అమ్మా%ొా%మీ మనవరాలు చాలా తెలివైనది, చురుకైనది. టీచర్లు అంటే ఆమెకు చాలా గౌరవం. చాలా చక్కగా పాఠాలు వింటుంది. బాగా చదువుకుంటుంది. మా టీచర్లు అందరికీ జానకి అంటే చాలా ఇష్టం. జానకిని బాగా చదివించండి. ఆమె మీ కుటుంబానికి పేరు తీసుకొస్తుంది. ఈ చిన్న వయస్సులో పెళ్లి అంటూ ఆమె చదువుకు ఆటంకం కలిగించవద్దు. చక్కగా చదువుకోనివ్వండి. తన కాళ్ళ మీద తాను నిలబడి మీ అందరినీ బాగుగా చూసుకుంటుంది. మీకు సమాజంలో గౌరవాన్ని తీసుకొస్తుందని మోహన్ సార్ చెబుతూ, జానకికి బై..బై%ొా% చెబుతూ అక్కడి నుంచి తన భార్యతో కలిసి తన ఊరికి బయలుదేరారు.

**పిల్లా తిరుపతిరావు, 7095184846**

# సినిమా రివ్యూ



'ది' విజయ్ దేవరకొండ హీరోగా పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించిన తాజా సినిమా 'ఫ్యామిలీ స్టార్'. బ్లాక్ బస్టర్ 'గీత గోవిందం' తర్వాత వాళ్లిద్దరూ చేసిన చిత్రమిది. ఇందులో 'సీతా రామం', 'హాయ్ నాన్న' ఫేమ్ మృణాల్ ఠాకూర్ హీరోయిన్. 'దిల్' రాజు నిర్మాత. ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూడండి.

కథ : గోవర్ధన్ (విజయ్ దేవరకొండ) మిడిల్ క్లాస్ కుర్రాడు. కుటుంబ బాధ్యతలను బరువు అనుకోకుండా... అన్నా వదినలు, పిల్లల కోసం బతికే యువకుడు. వాళ్లింట్లో పెంట్ హౌస్ అద్దెకు తీసుకుంటుంది ఇందు (మృణాల్ ఠాకూర్). హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతోంది. ఇంట్లో అందరితో కలివిడిగా కలిసిపోతుంది. తొలుత ఇందుకు దూరంగా ఉన్నప్పటికీ... మెల్లగా ప్రేమలో పడతాడు గోవర్ధన్. తన ప్రేమను చెప్పాలని అనుకున్న సమయానికి ఇందు చేసిన ఓ పని వల్ల బాగా హర్ట్ అవుతాడు. అసలు, ఇందు ఏం చేసింది? హర్ట్ అయిన గోవర్ధన్ ఏం చేశాడు? ఇద్దరూ అమెరికా ఎందుకు వెళ్లారు? మిడిల్ క్లాస్ కుర్రాడితో డబ్బున్న అమ్మాయి ప్రేమ కథలో మనస్పర్థలు, అడ్డంకులు ఏం వచ్చాయి? చివరకు ఏమైంది? అనేది మిగతా సినిమా.

విశ్లేషణ :

ఇటీవల హీరో అంటే లార్జర్ దేన్ లైఫ్ అన్నట్టు దర్శక రచయితలు వాళ్ల క్యారెక్టర్లు డిజైన్ చేస్తున్నారు. స్టార్ హీరోలను కామన్ మ్యాన్ క్యారెక్టర్లలో చూపించడం అరుదు అయిపోయింది. ఇటువంటి తరుణంలో విజయ్ దేవరకొండను మిడిల్ క్లాస్ కుర్రాడిగా చూపిస్తూ పరశురామ్ 'ఫ్యామిలీ స్టార్' తీశారు. టీజర్, ట్రైలర్, పాటలు చూసినప్పుడు... కథ కంటే ఎమోషన్స్ ఎక్కువ కనెక్ట్ అయ్యేలా కనిపించింది. మరి, 'ఫ్యామిలీ స్టార్'లో ఎమోషన్స్ ఎలా ఉన్నాయి? రొమాన్స్ ఎలా ఉంది? కామెడీ సంగతి ఏంటి? అనేది చూస్తే...

కథలోకి వెళ్లడానికి 'ఫ్యామిలీ స్టార్' దర్శకుడు పరశురామ్ పెట్ల కాస్త ఎక్కువ టైం తీసుకున్నాడు. ఈతరం ప్రేక్షకుల్లో, ముఖ్యంగా యువతలో విజయ్ దేవరకొండ ఇమేజ్ దృష్టిలో పెట్టుకుని ఆయన్ను మిడిల్ క్లాస్ కుర్రాడిగా చూపించడానికి కష్టపడ్డారు. ఆ మిడిల్ క్లాస్ సీన్స్ కంటే హీరో హీరోయిన్ మధ్య సన్నివేశాలు బావున్నాయి. హీరో కుటుంబ నేపథ్యం, బ్రదర్స్ మధ్య రిలేషన్ కొత్తగా ఏమీ లేదు. రొటీన్ అని చెప్పాలి. ఇంటర్వెల్ ట్విస్ట్ ఒక్కటీ కాస్త క్యూరియాసిటీ క్రియేట్ చేసింది.

ఇంటర్వెల్ తర్వాత సన్నివేశాలు ఫ్యామిలీని పక్కనపెట్టి హీరో హీరోయిన్స్ మీద ఎక్కువ కాన్సంట్రేట్ చేశారు దర్శకుడు. క్లైమాక్స్‌కు ఓ 20 నిమిషాల ముందు వరకు విలన్ ఎవరూ లేరు. అప్పటి వరకు మూవీ రన్ టైమ్ బిగ్గెస్ట్ విలన్ రోల్ ప్లే చేసింది. 'ఫ్యామిలీ స్టార్' సినిమాలో కొన్ని ఎమోషన్స్ కామన్ పీపుల్, ముఖ్యంగా మిడిల్ క్లాస్ ఆడియన్స్‌కు నచ్చుతాయి. 'గీత గోవిందం'లో బ్యాక్ టు బ్యాక్ సన్నివేశాలతో ఫన్ / ఎమోషన్ వర్కవుట్ చేసిన పరశు రామ్... 'ఫ్యామిలీ స్టార్'లో ఆ విధంగా బ్యాక్ టు బ్యాక్ సన్నివేశాలతో ఎంగేజ్ చేయలేదు. ట్రాక్ తప్పారు. సంభాషణల్లో కొన్ని తప్పితే పెద్దగా మెరుపులు లేవు. రోలర్ కోస్టర్ రైడ్ తరహాలో ఉంటుందీ 'ఫ్యామిలీ స్టార్'.

గోపీసుందర్ పాటల్లో 'మధురము కదా...' బావుంది. 'కల్యాణీ వచ్చా వచ్చా'కు సరైన ప్లేస్‌మెంట్ లేదు. నేపథ్య సంగీతం పర్వాలేదు. సినిమాటోగ్రఫీ బావుంది. ప్రొడక్షన్ వేల్యూస్ రిచ్‌గా ఉన్నాయి. ఫైట్ మాస్టర్లను మెచ్చుకోవాలి. ఫ్యామిలీ టచ్ పోకుండా డీసెంట్ ఫైట్స్ తీశారు.

'గీత గోవిందం', 'ఖుషి' తర్వాత మరోసారి ఆ తరహా మిడిల్ క్లాస్ కుర్రాడి పాత్రలో విజయ్ దేవరకొండ ఒదిగిపోయారు. క్యారెక్టర్ వరకు చక్కగా చేశారు. విజయ్ జోడీగా మృణాల్ ఠాకూర్ బావుంది. పాటల్లో గానీ, పతాక సన్నివేశాల్లో గానీ ఆమె నటన అలా చూస్తూ ఉండిపోవచ్చు. జగపతి బాబు, దివ్యాంశ కౌశిక్, రవిబాబు, అచ్యుత్ కుమార్ తదితరులవి అతిథి పాత్రలే. తమ పరిధి మేరకు చేశారు. ఫస్టాఫ్‌లో ప్రభాస్ శ్రీను, సెకండాఫ్‌లో 'వెన్నెల' కిశోర్ కాసేపు నవ్వించారు.

'ఫ్యామిలీ స్టార్' కథలో కొత్తదనం లేదు. సినిమా చూసేటప్పుడు ఇంతకు ముందు చూసినవి గుర్తుకు వస్తాయి. కథలో పాత వాసనలు ఉన్నాయి. పరశురామ్ పాత కథను కొత్త సీసాలో చెప్పే ప్రయత్నం చేశారు. అందువల్ల, కథ కంటే ఎమోషన్స్ ఎక్కువ కనెక్ట్ అవుతాయి. సినిమా నిదానంగా మొదలైంది. ఇంటర్వెల్ దగ్గర ట్విస్ట్ సర్‌ప్రైజ్ చేస్తుంది. చివరి 20 నిమిషాలు ఎంగేజ్ 'నెక్స్ట్ ఏంటి?' అని చూసేలా తీశారు. అసలు అంచనాలు లేకుండా వెళితే... మధ్యలో కొన్ని మూమెంట్స్, కామెడీ సీన్లు ఎంజాయ్ చేయవచ్చు. మిడిల్ క్లాస్ పీపుల్, మహిళలకు నచ్చే కంటెంట్ అయితే ఉంది.




మలయాళ ఇండస్ట్రీ చరిత్రలో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమా 'మంజుమ్మెల్ బాయ్స్'. రూ. 200 కోట్లు కలెక్ట్ చేసింది. ఎటువంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ సినిమా వసూళ్ల సునామీ సృష్టించింది. సౌబిన్ షాహిర్ ఓ ప్రధాన పాత్రలో నటించడంతో పాటు నిర్మించారు. చిదంబరం ఎస్ పొదువల్ దర్శకత్వం వహించారు. గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ భాసి ఇతర ప్రధాన తారాగణం. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని తెలుగులో డబ్బింగ్ చేసి ఏప్రిల్ 6న విడుదల చేసింది. ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూద్దాం.

కథ

: కేరళలోని మంజుమ్మెల్ ప్రాంతానికి చెందిన ఓ స్నేహితుల బృందం కొడైకెనాల్ ట్రిప్‌కు వెళుతుంది. దేవాలయం దర్శనం తర్వాత గుణ కేవ్స్ (కమల్ హాసన్ హీరోగా సంతాన భారతి దర్శకత్వం వహించిన 'గుణ' సినిమాలో చూపించిన గుహలు) దగ్గరకు వెళతారు. అక్కడ ఓ స్నేహితుడు గుహల్లోని ఇరుకైన లోయలో పడిపోతాడు. అందులో పడిన మనుషులు ఎవరూ ప్రాణాలతో తిరిగి పైకి రాలేదు సరికదా శవాలు సైతం దొరకలేదని, స్నేహితుడి మీద ఆశలు వదులుకోమని మిగతా వాళ్లకు అక్కడి ప్రజలు చెబుతారు. అయితే, గుణ కేవ్స్ నుంచి వాళ్లు కదలరు. చివరకు గుహలో పడిన వ్యక్తి బతికి ఉన్నాడని తెలుస్తుంది. అతని ప్రాణాలతో బయటకు తీసుకు రావడం కుదిరిందా? లేదా? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

విశ్లేషణ :

మలయాళ పరిశ్రమలో, ఆ మాటకు వస్తే ఇండియన్ సినిమాల్లో సర్వైవల్ థ్రిల్లర్ జానర్ సినిమాలు చాలా తక్కువ. హాలీవుడ్ సినిమాల్లో ఇటువంటి ఫిలిమ్స్ ఎక్కువ. రీసెంట్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'ది గోట్ లైఫ్ - ఆడు జీవితం' కూడా ఈ జానర్ సినిమాయే. హాలీవుడ్ సినిమాలతో పాటు 'ది గోట్ లైఫ్' చిత్రానికి, 'మంజుమ్మెల్ బాయ్స్' చిత్రానికి డిఫరెన్స్ ఏమిటంటే... నేటివ్ థ్రిల్లర్ టచ్!

'మంజుమ్మెల్ బాయ్స్' సినిమా ప్రారంభం అంత గొప్పగా ఏమీ లేదు. సాధారణంగా ప్రారంభమైంది. ఊరిలో రెండు గ్యాంగ్స్, వాళ్ల మధ్య గొడవలు, స్నేహితుల మధ్య సన్నివేశాలు కొత్తగా ఏమీ లేవు. అంతా రొటీన్. గుణ కేవ్స్ దగ్గరకు వెళ్లిన తర్వాత అసలు కథ మొదలైంది. గుహలోని లోయలో మనిషి పడిన తర్వాత ఉత్కంఠ, తర్వాత ఏం జరుగుతుంది? అనే ఆసక్తి కలుగుతుంది.

'మంజుమ్మెల్ బాయ్స్' పూర్తిగా డైరెక్టర్స్ మూవీ. ఇందులో ఫలానా వ్యక్తి హీరో అని చెప్పలేం. సన్నివేశాన్ని బట్టి ఒక్కొక్కరు హీరోగా కనబడతారు. గుహలోకి మనిషి పడిన తర్వాత వచ్చే ప్రతి కళ్ల ముందు జరిగినట్టు ఫీలయ్యేలా తెరకెక్కించారు దర్శకుడు చిదంబరం. రాళ్లు రప్పల మధ్య కొట్టుకుని కింద పడిన స్నేహితుడిని పైనుంచి వచ్చిన వ్యక్తి కలిసినప్పుడు వచ్చే ఓ సీన్ గుండెలు అదిరేలా చేస్తుంది. స్టార్టింగ్ కొన్ని సీన్లు గొప్పగా అనిపించవు. కానీ, ఎండింగ్ సీన్లకు కనెక్ట్ చేసిన విధానం, గుణ'లో పాటను వాడుకున్న తీరు సింప్లీ సూపర్బ్.

సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ భాసి, జార్జ్ మరియన్... ప్రతి ఒక్క ఆర్టిస్ట్ పాత్రకు తగ్గట్టు చక్కగా నటించారు. ప్రొడక్షన్ డిజైన్, మ్యూజిక్ అండ్ కెమెరా వర్క్ ఎక్స్‌ట్రాడినరీగా ఉన్నాయి. చిదంబరం దర్శకత్వంలో, ముఖ్యంగా విశ్రాంతి తర్వాత సన్నివేశాల్లో మెరుపులు ఉన్నాయి.

ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో వచ్చిన బెస్ట్ సర్వైవల్ థ్రిల్లర్లలో 'మంజుమ్మెల్ బాయ్స్' ముందు వరుసలో ఉంటుందని చెప్పవచ్చు. ఫస్టాఫ్ కొంత సాదాసీదాగా ఉంటుంది. ఒక్కసారి గుహలోకి వెళ్లిన తర్వాత క్యూరియాసిటీ పెరుగుతుంది. అది కంటిన్యూ అవుతుంది. టికెట్ రేటుకు సరిపడా థ్రిల్ ప్రేక్షకులకు గ్యారంటీ. గో అండ్ వాచ్.

7.4.2024 సూర్య ఆదివారం

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)


నిర్వహణ :

స్వర్ణకంకణ సన్మానిత, జ్యోతిష్య చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద

డా॥ఈడ్పుగంటి పద్మజారాణి



91 9849250852,

91 7506976164

padma.suryapaper@gmail.com


# 7.4.2024 నుంచి 13.4.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలో సంతానము ఎక్కువ శ్రమతో విద్యలో ఆశించిన ఫలితములు, విద్యార్థులకు ఎలక్ట్రానిక్ సంబంధిత వస్తువుల కొరకు ఖర్చులు అధికంగా ఉంటాయి. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కొరకు ప్రయత్నం చేయు విద్యార్థులు శ్రమ అధికం చేస్తారు. ఆధ్యాత్మిక అంశాలలో పాల్గొంటారు. పూర్వము ఇచ్చిన రుణములు కొంత కష్టం మీద తిరిగి వస్తాయి. మనసుకు కొంత ఆహ్లాదకరంగా ఉంటుంది, బాగ స్వామికి వృత్తిపరమైన విషయాలలో అధిక శ్రమ నూతన బాధ్యతలు. నూతన ప్రణాళికల కొరకు ఆలోచనలు చేస్తారు. దూర ప్రదేశాలలో ఉండే మిత్రుల సహాయలతో కొత్త నిర్ణయాలు తీసుకుంటారు. ధైర్యం పెరుగుతుంది. కుటుంబంలోని వారి విజయం కొంత ఆనందాన్నిస్తుంది. తల్లితండ్రుల సహకారం లభిస్తుంది



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో రావలసిన లాభాలు అందడంలో కొంత ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ అందుకోగలుగుతారు. సంతానం కొరకు అధిక ఖర్చులు చేస్తారు. మాట విలువ పెరుగుతుంది. గుర్తింపు గౌరవాన్ని పొందడంతో పాటు విదేశీ అవకాశాలు.రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి గవర్నమెంట్ సంబంధిత టాక్సును చెల్లిస్తారు, రావలసిన ధనాన్ని అందుకుంటారు వృత్తిపరమైన అభివృద్ధి ఉంటుంది. వృత్తిపరమైన విషయాలు వ్యాపార లవాదేవిలు కుటుంబ,గృహ, వాహన, భాగస్వామ్య అంశాలు చాలా వరకు మీకు అనుకూలంగా ఉంటాయి. వృత్తిలో అధికారంలో ఉండే వ్యక్తుల సహకారం ఆశించిన స్థాయిలో లేకపోయినప్పటికీ అనుకూలతే సిద్ధిస్తుంది. సంఘంలో గౌరవము మర్యాద కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో విజయ సాధనలో పోటీ పరీక్షలలో విద్యార్థులు చాలా శ్రమ పడతారు. స్థిరాసుల మీద ఆదాయం అందుకోవడం జరుగుతుంది. మనసులోని కోరికలు నెరవేరడం, చిన్న నాటి మిత్రులను కలుస్తారు. విద్యాపరమైన అంశాలలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొన్ని విషయాలలో శ్రమకు తగిన ఫలితాలు వస్తుంది. ఆకస్మికమైన ఖర్చులు అధికంగా ఉంటాయి భాగస్వామికి ఆధ్యాత్మికపరమైన అంశాలలో, సాంఘిక పరమైన విషయాలలో అభివృద్ధి ఉంటుంది. స్త్రీలకు ఆదాయం అభివృద్ధి కరంగా ఉంటుంది. సంతానమునకు వృత్తిపరమైన అవకాశాలు, ఉన్నత అధికారుల సహాయ సహకారాలు కొంత ప్రయత్నం మీద కష్టంగా అందుతాయి.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో అత్యంత ఆత్మీయులు, దూరప్రదేశంలో మిత్రులు సహకారంతో ఆగిన పనులు ముఖ్యముగా మీడియా సంబంధించి ముందుకు వెళ్ళడానికి ప్రణాళికలు వేసుకుంటారు. విద్యార్థులు ఉన్నతవిద్యలో గట్టి కృషి శ్రమతో ఆశించిన ఫలితాలను పొందుతారు. వృత్తిపరమైన బాధ్యతలు అధికంగా ఉంటాయి శ్రమ ఎక్కువగా ఉంటుంది. ఆరోగ్యం మీద శ్రద్ధ పెరుగుతుంది. బహుమానములు పొందుతారు. వారం మధ్యలో కుటుంబంలోని స్త్రీల సహకారం పొందుతారు. ఉన్నత అధికారుల సాయం కొరకు చేయు ప్రయత్నాలలో ఆలస్యం ఆటంకం ఇబ్బంది కలిగిస్తుంది. వారం మధ్యలో భాగస్వామితో అపార్ధాలు రాకుండా జాగ్రత్త వహించాలి. దూర ప్రదేశాలలో ఉండే చిన్ననాటి మిత్రుల సహకారం బాగుంటుంది. ఒక వార్త ఆనందాన్ని కలిగిస్తుంది.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో ప్రణాళిక లేని ప్రయాణాలు కొంత చికాకును, గందరగోళం కలిగిస్తాయి. విశ్రాంతి లేని పనుల వల్ల వాటి ఫలితాల వలన కొంత అసంతృప్తి ఉంటుంది. ఆధ్యాత్మిక ఉపాసనాపరమైన అంశాలలో కొన్ని అవరోధాలు ఎదుర్కొంటారు. ఆర్థికపరమైన విషయాలలో కుటుంబ పెద్దల సహకారాన్ని ఆశిస్తారు. భాగస్వామితో, సంతానమ-ంతో అపార్థములు రాకుండా ఆలోచించి మాట్లాడాలి. ముఖ్యమైన విషయాలకి మధ్యవర్తిత్వం మంచిది కాదు.కమ్యూనికేషన్ విషయాలలో ఆత్మీయుల మధ్య కొన్ని రకాలైన చికాకులు ఇబ్బంది పడతాయి. వృత్తిపరంగా రావలసిన ఆదాయాన్ని అందుకుంటారు, భాగస్వామికి ఆదాయం అభివృద్ధికరంగా ఉంటుంది. నూతన వృత్తుల కొరకు ప్రయత్నాలు చేస్తారు.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

ప్రారంభంలో సంఘంలో గుర్తింపు గౌరవం పెరుగుతుంది, వృత్తిపరమైన అభివృద్ధి, నూతన వ్యక్తుల పరిచయాలు ఏర్పడతాయి,ఆరోగ్య, ప్రయాణ విషయాలు మొదలైన ముఖ్యమైన అంశములలోతగిన శ్రద్ధ తీసుకోవాలి. సంబంధము లేని వ్యక్తుల ఊహించని విమర్శలు మనసుని కలవర పెడతాయి. ముఖ్యమైన పనులు ఆకస్మికంగా వాయిదా పడతాయి ప్రతి విషయంలోన ఆలస్యాలు ఆటంకాలు చికాకును కలిగిస్తాయి. సంతానమునకు కొత్త అవకాశాలు ఉన్నప్పటికీ వారము మధ్యలో మీ మాటల వల్ల కుటుంబ సభ్యులలో అపార్థాలకు అవకాశము, ఘర్షణలు రాకుండా జాగ్రత్త పడాలి. స్థిరాస్తుల అంశాలలో రియల్ ఎస్టేట్ రంగంలో వారితో మెలకువగా వ్యవహరించాలి. పరిచయస్తులు మోసం చేసేందుకు అవకాశం ఉంది.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వార ప్రారంభంలో విద్యార్థులకు పోటీ తత్వం పెరుగుతుంది. శ్రమకి తగిన ఫలితాన్ని పొందుతారు. సంఘంలో పలుకుబడి పెరుగుతుంది సామాజిక సేవ చేస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు ఆరోగ్య మీద శ్రద్ధ అధికంగా ఉంటుంది రోగనిరోధక శక్తిని పెంచుకుంటారు. చాలా ఉత్సాహంగా ఉంటారు భాగస్వామికి సంబంధించిన ఖర్చు అధికంగా ఉంటాయి రుణములు చెల్లిస్తారు కొత్తరుణం కొరకు ప్రయత్నం చేస్తారు. సేవకులు సహకరిస్తారు. కుటుం బంలోని వ్యక్తులకు నూతన వృత్తిలో అవకాశాలు. సంతానానికి అభివృద్ధి. ఆత్మీయులైన మిత్రులతోనూ సోదరీ వర్గంతోనూ సమావేశాలు చర్చలు. కొత్త బహుమానాలు అందుకుంటారు. ఆరోగ్య శ్రద్ధ అవసరము, మానసిక ప్రశాంతత తగ్గుతుంది ఆకస్మిక అనవసరమైన ప్రయాణాలు,



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ట 1,2,3,4 పాదములు

ప్రారంభంలో విద్యార్థులు గట్టి శ్రమ మీద పరీక్షలకు సన్నద్ధులు అవుతారు. గవర్నమెంట్ వృత్తుల కొరకు పోటీ పరీక్షలకు సంతానము చేయు ప్రయత్నాలకు మీ ఆత్మీయుల సహకారం తోడ్పాటు అందిస్తారు సంతానము యొక్క అభివృద్ధి, వారికి నూతన అవకాశములు మీకు ఆశాజనకంగా ఉంటుంది.రావలసిన రుణములు అందుకుంటారు. ముఖ్యముగా స్త్రీ సంతానం వృత్తిపరంగా చేసే ప్రయత్నాలలో అభివృద్ధికరంగా ఉంటుంది. ఉన్నత అధికారులతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించాలి. విదేశాల కొరకు ఆహ్వానాలని అందుకుంటారు. వారం చివరిలో రీసర్చ్ చేయు విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. అభివృద్ధి కొరకు చేయి ప్రయత్నాలు సంతృప్తికరంగా ముందుకు సాగుతాయి. ముఖ్యమైన పనులు కొంత వాయిదా పడే అవకాశం ఉంది. ఆరోగ్యం మీద శ్రద్ధ తీసుకోవాలి



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాడ 1వ పాదము

వారం ప్రారంభంలో సమయానికి ఆహార స్వీకరణ తగిన విశ్రాంతి అవసరము. విద్యాపరమైన విషయాలలో విద్యార్థులు చాలా శ్రమ పడతారు. ఉపాసన అంశాలలో కొన్ని అవరోధాలు చికాకును కలిగిస్తాయి. జ్ఞాపకశక్తిని మెరుగుపరుచుకునే విషయాల్లో శ్రద్ధవహించాలి వృత్తిపరంగా శ్రమ బాధ్యత అధికంగా ఉన్నప్పటికీ తగిన గౌరవాన్ని పొందుతారు నూతన ప్రయత్నాలు చేస్తారు. ఆర్థిక విషయాలలో స్థిరాస్తుల అంశాలలో వాతావరణం కొంత చికాకుగా ఉన్నప్పటికీ, పెద్దల సహకారంతో దాన్ని అధిగమిస్తారు. భాగస్వామి వృత్తిపరమైన విషయాలలో కొంత అభివృద్ధి మీకు సంతోషాన్ని కలిగిస్తుంది. నూతన వాహన గృహ కొనుగోలు కొరకు ఆలోచనలు అధికం చేస్తారు. వారం మధ్యలో రావలసిన బాకీలను వసూలు చేసుకుని ఊరట పొందుతారు.



## మకర రాశి

ఉత్తరషాడ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ట 1,2 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరమైన విషయాలలో ఉన్నత అధికారుల సహకారం, కింద పని చేస్తే సిబ్బంది సహాయం, ఆకస్మికమైన విషయాలలో కొంతలాభం, శుభకార్యాలకు ఆహ్వానాలు, మిత్రులను కలుస్తారు. వృత్తిపరమైన విషయాలలో సోషల్ మీడియాలో పెట్టుబడి ఆలోచనలు చేస్తారు. స్థిరాస్తులు అంశములలో ఆత్మీయులతో కొంత ఘర్షణాత్మకమైన వాతావరణం, భాగస్వామికి ఆదాయం అభివృద్ధి, గృహాల్లో ముఖ్యమైన కార్యక్రమాలు ఆలస్యాలు, వాహనములకు సంబంధించిన చిన్నబాటి రిపేర్లు. స్త్రీల సహకారాన్ని పొందుతారు. భాగస్వామికి గుర్తింపు గౌరవం లభిస్తుంది. సంతానపరమైన విద్యా విషయాలు మొదలైన అంశాల మీద శ్రద్ధ విద్యార్థులు గట్టిగా కృషి చేయాలి. విదేశాలలో ఉండే వ్యక్తుల సహకారం లభిస్తుంది.



## కుంభ రాశి

ధనిష్ట 3,4 పాదములు శతబిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభం మాటలతో అందరినీ ఆకట్టుకుంటారు. సమయస్ఫూర్తి నిర్ణయాలు తీసుకుంటారు. చుట్టుపక్కల వ్యక్తులతో కమ్యూనికేషన్ విషయాల్లో అపార్థాలు రాకుండా జాగ్రత్త పడాలి. ఆత్మీయులతో కలిసి మంచి వాతావరణంలో చిన్నపాటి ప్రయాణాలు గెట్ టుగెదర్లు ప్రణాళిక చేసుకుంటారు. శారీరక శ్రద్ధ ఆకర్షణ పెరుగుతాయి.సంతోషంగా ఉంటుంది, మిత్రులు తోబుట్టువుల సహకారం బాగుంటుంది. జర్నలిజం కు గుర్తింపు. గృహ వాతావరణం కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. వృత్తిపరమైన , భూ సంబంధ అంశములలో రియల్ ఎస్టేట్ రంగంలో వారితో ఆచితూచి వ్యవహరించాలి. విద్యార్థులు విద్య మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలి అనవసర విషయాలకు దూరంగా ఉండాలి. వాదనలకు దూరంగా ఉండాలి.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాబాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరంగా అధిక శ్రమ బాధ్యతలు పెరగడం వల్ల సమయానికి ఆహార స్వీకరణ విశ్రాంతి విషయాల్లో శ్రద్ధ వహించాలి. వృత్తిపరంగా ఉన్నతాధికారులతో సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తారు. భాగస్వామికి ఆర్థిక విషయాలలో అనుకూలంగా ఉంటుంది.రావలసిన ఆదాయము సమయానికి అందడంలో ఆనందం కలిగిస్తుంది. కుటుంబ వ్యక్తులతో కలిసి తీసుకునే నిర్ణయాలు ఆశవహంగా ఉంటాయి. వారం మధ్యలో సామరస్యంగా పనులను వ్యక్తుల సహకారంతో సమస్యలను పరిష్కరించుకుంటూ ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళతారు. భాగస్వామి సహాయ సహకారాలు అందుకుంటారు. విదేశీ ఆదాయాన్ని, బాగస్వామి తరపున విదేశాలలో ఉన్న ఆత్మీయుల సహాయాన్ని సమయానికి పొందగలుగుతారు.



అంజలి